PRABHATA SURYA

ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 మంగళవారం 8 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 62

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## లోయర్ మానేరు డ్యాం పరిసరాల్లో కార్యక్రమంలో మొక్కలు నాటిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**కరీంనగర్ :** వన మహోత్సవంలో భాగంగా వాకింగ్ ట్రాక్ వద్ద 2 వేలకు పైగా మొక్కలు మహిళలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి,కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గోన్నారు.


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news




## ఎఫ్అండ్వో హస్తలాఘవంపై మోదీ మౌనం

- సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చే ప్రయత్నం
- రాహుల్ గాంధీ ధ్వజం
- ఎఫ్అండ్వోలో పలు లొసుగులు ఉన్నాయని తాను గతంలోనే హెచ్చరించా
- ఎఫ్అండ్వో మార్కెట్ పెద్ద పెట్టుబడిదారులకు ఆటస్థలంగా మారింది



## నా యాత్ర క్షేమంగా సాగడానికి కృషి చేశారు

- అంతరిక్షం నుంచి ఇస్రో చైర్మన్ తో మాట్లాడిన శుభాంశు శుక్లా
- ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుక్లా
- యాక్సియమ్-4 మిషన్లో భాగంగా ఐఎస్ఎస్లో పరిశోధనలు

# మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు



- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చే బాధ్యత.. గెలిపించే పూచీ నాదే
- త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల్లోనూ 33% మహిళా రిజర్వేషన్లు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్
- మంత్రి కొండా సురేఖతో కలిసి వనమహోత్సవం ప్రారంభం

**సూర్య న్యూస్ ఏజీ వర్సిటీ (హైదరాబాద్)**

త్వరలోనే నియోజకవర్గాల పునర్విభజనతో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్లు రాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 153 అసెంబ్లీ సీట్లకుగాను 50 సీట్లు అంటే 33 శాతం మంది ఆడబిడ్డలు ఎమ్మెల్యేలు అవుతారని చెప్పారు. 33 శాతం సీట్లకు ఇంకో 10 సీట్లు కలిపి మొత్తం 60 సీట్లను ఆడబిడ్డలకు ఇచ్చే బాధ్యత తాను తీసుకుం టానన్నారు. మంచిపనులు చేసి పేరు తెచ్చుకొనే మహిళలను గుర్తించి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వడమే కాకుండా వారిని గెలిపించే పూచీ కూడా తనదేనన్నారు. సోమవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ - మిగతా2లో



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను సవాల్‌గా తీసుకుంటాం

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**సూర్య న్యూస్ హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికను తాము సవాల్‌గా తీసుకుంటామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల పై దృష్టి సారించి..మెజార్టీ స్థానాలను గెలుచుకుంటా మని విశ్వాసం వ్యక్తం చేశారు. 25 రోజుల్లో పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటించి, కమిటీ కూర్పుపై ముఖ్య నేతలతో చర్చిస్తామని తెలిపారు. అందులో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తామని, భాజపాలో వర్గాలేమీ లేవని, అందరం పార్టీ లైన్‌లో కలిసికట్టుగా వెళ్తామని ఆయన - మిగతా2లో

## భట్టితో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల భేటీ

**ఫీజు రీయుంబర్స్‌మెంట్ చెల్లింపు ప్రత్యామ్నాయాలపై చర్చ..**

**కొత్తగా ఎస్బీఐ ఎడ్యుకేషన్ ఎపెక్స్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదన**




**సూర్య న్యూస్ హైదరాబాద్**

గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సర్కారు ముందు ప్రైవేటు కాలేజీల యాజమా న్యాలు కొత్త ప్రతిపాదన ఉంచాయి. ప్రతి ఏటా దాదా పు రూ.2,500 కోట్లు ప్రభుత్వం చెల్లిం చాల్సి ఉన్న నేపథ్యంలో.. కొత్తగా ఎస్బీఐ ఎడ్యుకేషన్ ఎపెక్స్ బ్యాంక్ ఏర్పాటు చేసి, దీని ద్వారా ఉన్నత విద్యాసంస్థల ఆర్థిక లావాదేవీలన్నీ నిర్వహించాలని కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు కోరారు. సోమవారం డిప్యూటీ సీఎం, - మిగతా2లో

# కొత్త జాబ్ క్యాలెండర్ ఏమైంది?

- జాబ్ క్యాలెండర్‌లో పేర్కొన్న ప్రకారం వెలువడని నోటిఫికేషన్లు
- ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పెండింగ్‌తో నిలిచిన నోటిఫికేషన్ల జారీ
- ప్రస్తుతం వర్గీకరణ ప్రక్రియ పూర్తయినా వెలువడని వైనం
- గతేడాది క్యాలెండర్ ప్రకటనల గడువు
- ముగిసి 4 నెలలు కావొస్తున్నా కొత్త క్యాలెండర్ ఊసేలేదు
- ఉద్యోగ ప్రకటనలు ఎప్పుడో తెలియక నిరుద్యోగుల్లో నిరాశ, అయోమయం




**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియను నిర్దిష్ట విధానంలో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకున్న జాబ్ క్యాలెండర్ అమలు జాడలేదు. ఏడాది కాలంలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లను ఏ సమయంలో విడుదల చేస్తారు... పరీక్షల నిర్వహణ ఎప్పుడు తదితర అంశాలపై అభ్యర్థులకు - మిగతా2లో




## ఐసెట్‌లో అమ్మాయిలదే హవా

- మొత్తం 58,985 మంది ఉత్తీర్ణత
- వారిలో అమ్మాయిలు 30,986 మంది
- ఈసారి ఆగస్టులోనే కౌన్సెలింగ్...

**సూర్య న్యూస్ హైదరాబాద్**

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఐసెట్‌లో అమ్మాయిలదే పైచేయి. పరీక్ష రాసిన వారి సంఖ్యతో పాటు.. ఉత్తీర్ణులపరంగానూ వారిదే అగ్రస్థానం. మొత్తం 58,985 మంది ఉత్తీర్ణులుకాగా... వారిలో అమ్మాయిలు 30,986 మంది (52.53 శాతం) ఉన్నారు. టాప్ ర్యాంకుల్లో అబ్బాయిలు - మిగతా2లో

## సిగాచీలో అడుగడుగునా ఉల్లంఘనలు..

**కనీస ప్రమాణాలు పాటించని యాజమాన్యం**

**తనిఖీల్లో కీలకాంశాలపై కర్మాగారాల విభాగం ఉదాసీనత**

**బయటకొచ్చిన 6 నెలల కిందటి నివేదిక**



**సూర్య న్యూస్ హైదరాబాద్**

సిగాచీ కర్మాగారంలో పేలుడు ఘటనకు భద్రతా ప్రమాణాల వైఫల్యం, అధికారుల ఉదాసీనత వైఖరి ప్రధాన కారణంగా తెలుస్తోంది. 6 నెలలకోసారి కర్మాగారాల విభాగం నిర్వహించే తనిఖీల్లో భవన నిర్మాణ పటిష్ఠతతోపాటు పలు కీలకాంశాలను చూసీచూడనట్లు వ్యవహరించినట్లు కనిపిస్తోంది. ఈ విషయాలపై తనిఖీ నివేదికలో 'బాగున్నాయని, అనుమతులు అవసరం లేదని' పేర్కొనడం గమనార్హం. ఇప్పుడవే ప్రమాదానికి కారణమై 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. గతేడాది డిసెంబరు 12న పాశమైలారం పారిశ్రామికవాడ ప్లాట్ నం.20లో ఉన్న సిగాచీ ఇండస్ట్రీస్‌ను కర్మాగారాల విభాగం తనిఖీ చేసింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన నివేదిక బయటకొచ్చింది. ఇక్కడ మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ పౌడర్, పౌడర్డ్ సెల్యులోజ్‌ను తయారు చేస్తున్నట్లు - మిగతా2లో



## డిగ్రీతో 'దోస్త్' అంతంతే

- డిగ్రీ కోర్సుల్లో ఉన్న సీట్లు 4.6 లక్షలు... ఇప్పటి వరకు 1.41 లక్షలే భర్తీ
- మూడు విడతల కౌన్సెలింగ్ పూర్తి.. ఏటా 2.20 లక్షలు దాటని వైనం
- బీకాం, బీఎస్సీ ఓకే.. సంప్రదాయ కోర్సులకు అంతంతే
- దోస్త్ ప్రవేశాల డేటా విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

# మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు

-మొదటిపేజీ తరువాయి

విశ్వవిద్యాలయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుద్రాక్ష మొక్కను నాటడం ద్వారా వనమహోత్సం%–%2025 కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

**ఇంటింటా రెండేసి మొక్కలు..**

తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని.. దీన్ని స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ కోవలోనే రాష్ట్రంలోని తల్లులంతా వారి పిల్లల పేరుతో ఇళ్ల ఆవరణలో రెండేసి మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కలను పిల్లల్లాగే సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది అటవీ శాఖ ఆధ్వర్యంలో 18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపడుతుందని.. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు.

**ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం..**

ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఒకప్పుడు సోలార్ పవర్ ప్రాజెక్టులను అదానీ, అంబానీలు మాత్రమే ఏర్పాటు చేసేవారని.. కానీ తాము మూడేసి మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టులను మహిళా స్వయం సేవా సంఘాలకు అప్పగిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని.. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని సీఎం



వివరించారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు ఉండేచోట 3.5 ఎకరాల స్థలాన్ని మహిళా స్వయం సేవా సంఘాలకు కేటాయించి వారు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించడానికి వీలు కల్పించామని చెప్పారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ. 21 వేల కోట్ల మేర రుణాలు అందించామని తెలిపారు.

**చెట్లు పెంచితేనే సకాలంలో వర్షాలు: మంత్రి కొండా సురేఖ**

చెట్లను కాపాడితే అవి మనల్ని కాలుష్యం నుంచి కాపాడతాయని, జీవవైవిధ్యాన్ని రక్షించుకోవడంలో దోహదపడతాయని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. చెట్లను పెంచడం ద్వారానే వర్షాలు సకాలంలో కురుస్తాయని చెప్పారు. వనమహోత్సవం కార్యక్రమంలో 100 శాతం మొక్కలు నాటి వాటిని కాపాడేందుకు రాష్ట్రంలోని ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అటవీశాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అధికారులు, ప్రజాప్రతినిదులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కొండా సురేఖ తిలకించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్, కమిషనర్ కర్ణన్, జిల్లా ఆదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఉన్నతాదికారులు పాల్గొన్నారు.

# కొత్త జాబ్ క్యాలెండర్ ఏమైంది?

-మొదటిపేజీ తరువాయి

ముందస్తుగా స్పష్టత ఇవ్వడమే జాబ్ క్యాలెండర్ ముఖ్య ఉద్దేశం. ఈ క్యాలెండర్‌ను ఏటా ప్రకటిస్తే అభ్యర్థులు వ్యూహాత్మక లక్ష్యంతో ముందుకు పోవచ్చనే ఆలోచనతో ప్రజాప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా గతేడాది ఆగస్టులో తొలి జాబ్ క్యాలెండర్‌ను విడు దల చేసింది. అందులో గ్రూప్%–%1 ఉద్యోగాలతోపాటు ఇతర కేటగిరీ లకు చెందిన 15 రకాల ఉద్యో గాల భర్తీకి సంబంధించి నోటి ఫికేషన్ల విడుదల, పరీక్షల నిర్వహణకు తేదీలు ప్రకటించింది. కానీ ఎస్సీ వర్గీ కరణకు సంబంధించి అత్యున్నత న్యాయ స్థానం తీర్పు ఇవ్వడం.. ఆ తీర్పునకు అనుగుణంగా రిజర్వేషన్లు విభజించాల్సి రావడంతో ఉద్యోగ ప్రకటనలకు అంతరాయం ఏర్పడింది. వెలువడకపోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. తొలిజాబ్ క్యాలెండర్ గడువు సైతం ముగియడంతో కొత్త జాబ్ క్యాలెండర్ ఇస్తారా లేక గత క్యాలెండర్‌లో నిర్దేశించిన నోటిఫికేషన్లకు సంబంధించి తేదీలు మార్చి విడుదల చేస్తారా? అనే విషయం తెలియక నిరుద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

**రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పూర్తి...**

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఎస్సీ వర్గీకరణ తీర్పుతో బ్రేక్ పడటంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా వర్గీకరణ తీర్పును స్వాగతిస్తూ... ఈ ప్రక్రియ పూర్తయ్యాకే కొత్త ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో గతేడాది ఆగస్టు నుంచి ఎలాంటి ఉద్యోగ ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వం ప్రకటించిన తొలి జాబ్ క్యాలెండర్ ప్రకారం గతేడాది సెప్టెంబర్ నుంచి ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడాలి. కానీ వర్గీకరణ అంశంతో నోటిఫికేషన్ల విడుదల ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

మరోవైపు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు సంబంధించి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి అభిప్రాయాల స్వీకరణ, అమలుకు సంబంధించిన అధ్యయనాన్ని ప్రభుత్వం మొదలుపెట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి వర్గీకరణకు సంబంధించిన ప్రక్రియ పూర్తవగా ఏప్రిల్ 14న ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆ రోజు నుంచి రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించి అమలు చేస్తున్నారు. ఉద్యోగ నియామకాలకు అడ్డంకిగా మారిన వర్గీకరణ సమస్య తొలగిపోవడంతో ఉద్యోగ నియామకాల ప్రకటనల జారీకి మార్గం సుగమమైనప్పటికీ ఆ తర్వాత కూడా ఒక్క ఉద్యోగ ప్రకటన వెలువడలేదు.

**కొత్త జాబ్ క్యాలెండర్ ఏమైంది?**

రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఏప్రిల్‌లో జాబ్ క్యాలెండర్ జారీ చేస్తామని ప్రకటించింది. గతేడాది కాస్త ఆలస్యమైనప్పటికీ ఈ ఏడాది నుంచి వార్షిక సంవత్సరం బడ్జెట్ సమావేశాల అనంతరం ఈ జాబ్ క్యాలెండర్ జారీ చేస్తామని పలు సందర్భాల్లో సీఎంతోపాటు మంత్రులు ప్రకటించారు. ఈ లెక్కన ఈ ఏడాది ఏప్రిల్ నాటికి కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేయాల్సి ఉంది. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో గత జాబ్ క్యాలెండర్‌లో నిర్దేశించిన ప్రకటనలు వెలువడకపోవడంతో ఆయా ఉద్యోగాలతోపాటు కొత్తగా గుర్తించిన ఖాళీలతో కూడిన ఉద్యోగ ప్రకటనలకు సంబంధించిన అంశాలను కొత్త జాబ్ క్యాలెండర్‌లో వస్తాయని నిరుద్యోగులు భావించారు. కానీ కొత్త వార్షిక సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు నూతన జాబ్ క్యాలెండర్ ఊసే లేదు. ఏయే ఉద్యోగాల భర్తీ ఎప్పుడు జరుగుతుందా? అనే సందిగ్ధంలో నిరుద్యోగ అభ్యర్థులు సతమతమవుతున్నారు. ఉద్యోగ ప్రకటనల జారీలో జాప్యంతో వయోపరిమితి దాటిపోతుందనే ఆందోళన కొందరిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత జాబ్ క్యాలెండర్‌తో తాత్కాలిక కొలువులను వదిలేసి ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారు ఇప్పటికీ నోటిఫికేషన్లు విడుద కాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

## సిగాచీలో అడుగడుగునా ఉల్లంఘనలు..

-మొదటిపేజీ తరువాయి

పేర్కొంది. వీటిని ఫార్మా, ఆహార పరిశ్రమల్లో ముడి పదార్థంగా వినియోగిస్తారు. మండే స్వభావం కలిగి ఉంటాయి. సిగాచీలో మొత్తం 197 మంది పనిచేస్తుండగా.. వీరిలో 110 మంది రెగ్యులర్, 87 మంది ఒప్పంద కార్మికులు ఉన్నారు.

**గుర్తించిన లోపాలు..**

కర్మాగారంలో కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగితే.. చికిత్స చేసేందుకు కనీసం ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు లేవు. మిషనరీ హాల్ వద్ద సరైన సంఖ్యలో ఎగ్జిట్ ద్వారాలు లేవని గుర్తించిన కర్మాగారాల విభాగం అన్ని గదుల్లో అగ్నిమాపక అత్యవసర ద్వారాలు ఏర్పాటు చేయాలని తెలిపింది. అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అవసరమైన సంఖ్యలో ఫైర్‌ఫైటర్ పరికరాలు ఏర్పాటు చేసి, ఆ మేరకు శిక్షణ ఇవ్వాలని పేర్కొంది. కర్మాగారంలో వేలాడుతున్న వైర్లు కనిపించాయని తెలిపింది. కార్మికులకు రక్షణ పరికరాలు, భద్రతపై అవగాహన కొరవడ్డాయి. వారి కోసం సంక్షేమాధికారి, కనీసం క్వాలిఫైడ్ నర్సు, వైద్యుల్ని నియమించలేదని నివేదిక తెలిపింది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించింది.

# ఆస్పత్రుల్లో అవసరమైన అన్ని మెడిసిన్స్ సిద్ధంగా ఉంచుకోవాలి

**హైదరాబాద్:** కొత్త టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మెడికల్, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ త్వరగా కొనుగోలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకొని, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని సూచించారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో వైద్యశాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనరసింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడారు. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఫర్నీచర్ కొనుగోలు చేయాలని మంత్రి దామోదర రాజనరసింహ నిర్దేశించారు. కొత్త హాస్పిటళ్లకు పేషెంట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ఆ అంచనాలకు తగ్గట్లుగా ఫర్నీచర్, ఎక్విప్‌మెంట్ సరిపడా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడిసిన్ సరఫరాపై వివిధ విభాగాల హెచ్‌వోడీలని అడిగి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన అన్ని మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయా? లేవా అని డీఎంఈ, వీవీపీ కమిషనర్, డీహెచ్‌ను



అడిగారు. సీజనల్ వ్యాధుల కాలం కావడంతో పేషెంట్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని, ఇందుకు అనుగుణంగా మందులు అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి ఆదేశించారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్లలో కనీసం మూడు నెలలకు సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని టీజీఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు మంత్రి దామోదర రాజనరసింహ. ఆయా ఆస్పత్రుల్లో ఉన్న ప్లేట్‌లెట్ సపరేషన్ మిషన్లు మంచిగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించుకోవాలని మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశించారు. టీ డయాగ్నస్టిక్స్ హబ్స్‌లో అన్నిరకాల టెస్టులు, స్కాన్లు చేయాలని మంత్రి నిర్దేశించారు. ఒక్క టెస్టు కోసం కూడా పేషెంట్‌ను బయటకు పంపించొద్దని, ప్రతి పీహెచ్‌సీలోనూ టెస్టులు అవసరమైన పేషెంట్ల నుంచి శాంపిల్స్ సేకరించాలని, 24 గంటల్లోగా రిపోర్టులు అందజేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. గతేడాది కొత్తగా ప్రతి జిల్లాలోనూ మెడిసినల్ స్టోర్లను ఏర్పాటు చేశామని, ఆయా స్టోర్లకు పర్మినెంట్ బిల్డింగ్స్ నిర్మాణం కోసం తమ ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి గుర్తు చేశారు. అన్ని జిల్లాల్లోనూ బిల్డింగుల నిర్మాణాన్ని ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ కాలేజీలు అన్నింటిలోనూ సీటీ స్కాన్ మిషన్లను అందుబాటులోకి తీసుకువచ్చామని, అలాగే అవసరమైన చోట ఎంఆర్ఐ యంత్రాల ఏర్పాటుకు తమ ప్రభుత్వం నిధులు కేటాయించిందని మంత్రి స్పష్టం చేశారు. ఎంఆర్ఐ మిషన్ల కొనుగోలు, ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశించారు.

## భట్టితో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల భేటీ

-మొదటిపేజీ తరువాయి

ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన సమావేశంలో తె లంగాణ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఎన్. రమేశ్‌బాబు మాట్లాడుతూ ఆ బ్యాంకు నిధుల వడ్డీలతోనే చెల్లించవచ్చన్నారు. తమ ప్రతిపాదనపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని, సీఎస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు తెలిపాయి. ఆ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని వెల్లడించాయి.

## ఐసెట్‌లో అమ్మాయిలదే హవా

-మొదటిపేజీ తరువాయి

సత్తాచాటారు. తొలి 10లో ఎనిమిదింటిని కైవసం చేసుకున్నారు. ఏపీలోని విజయవాడకు చెందిన ఆర్ల క్రాంతికుమార్ ప్రథమ ర్యాంకు సాధించాడు. ఏడో ర్యాంకును కూడా ఏపీ విద్యార్థి సొంతం చేసుకున్నాడు. ఏపీ విద్యార్థులు ర్యాంకులు సాధించినప్పటికీ.. వారికి కన్వీనర్ కోటాలో ప్రవేశాలకు అర్హత లేని విషయం తెలిసిందే. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఐసెట్ ఛైర్మన్ అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్ అలువాల రవి తదితరులు ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ తొలిసారిగా నల్గొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఐసెట్‌ను నిర్వహించిందన్నారు. గతేడాది సెప్టెంబరులో కౌన్సెలింగ్ జరిగిందని, ఈసారి ఆగస్టులోనే నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యామండలి ఉపాధ్యక్షులు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఐసెట్ కో కన్వీనర్ రమేశ్, ఎంజీయూ ఆచార్యురాలు బి.సరిత తదితరులు పాల్గొన్నారు.

**62 ఏళ్ల వయసులో ఐసెట్ ర్యాంకు**

62 ఏళ్ల వయసులో ఐసెట్ రాసి... 178వ ర్యాంకు సాధించి ఔరా! అనిపించారు ఆదిలాబాద్ పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన ఆర్.సూర్యనారాయణ. ఎల్ఐసీలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆయన.. చదువుకు వయసు అడ్డంకి కాదని నిరూపించారు. మూడు నెలలు సన్నద్ధమై ఈ పరీక్ష రాసినట్లు తెలిపారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను సవాల్‌గా తీసుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు.

అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా?

'పాతబస్తీ సల్కం చెరువు భూమిలో అక్బరుద్దీన్ ఒవైసీ కళాశాల కట్టిన మాట వాస్తమేనని, అందులో 10 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, దాన్ని కూల్చలేమని ప్రభుత్వం చెబుతోంది. మూసీ పరీవాహక ప్రాంతంలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వేల మంది పేదలు శిఖం భూములని తెలియక కొని ఇళ్లను కట్టుకున్నారు. వీరి ఇళ్లను ఎందుకు కూల్చుతున్నారు. అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం..పేదలకు మరో న్యాయమా? ప్రభుత్వం అక్బరుద్దీన్ కళాశాల భవనాన్ని కూల్చకపోతే భాజపా ఆ పని చేస్తుంది' అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

## డిగ్రీతో 'దోస్త్' అంతంతే

హైదరాబాద్



డిగ్రీ కోర్సుల్లో చేరేవారి సంఖ్య అంతంతమాత్రంగానే ఉంటోంది. రాష్ట్రంలో 957 డిగ్రీ కాలేజీల్లో 4,36,947 సీట్లు అందుబాటులో ఉంటే, మూడు విడతల దోస్త్ కౌన్సెలింగ్ తర్వాత కూడా చేరిన వారి సంఖ్య 1,41,590 మాత్రమే. కనీసం సగంమంది కూడా చేరలేదు. ఇప్పటి వరకూ దోస్త్‌లో చేరిన విద్యార్థుల సంఖ్యను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి సోమ వారం మీడియాకు విడుదల చేశారు. ఏటా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అన్ని దశల కౌన్సెలింగ్ పూర్తయ్యేనాటికి 2.20 లక్షల మంది మాత్రమే చేరుతున్నారు. ప్రైవేట్ కాలేజీల్లో చేరేవారి సంఖ్య 37 శాతం మించడం లేదు. గ్రామీణ ప్రాంతాల కాలేజీల్లో అతి తక్కువ మంది చేరుతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ జిల్లాల్లో ఉన్న కాలేజీల్లో కొంతమేర సీట్లు భర్తీ అవుతున్నాయి. డిగ్రీ చదివే విద్యార్థులు పార్ట్ టైం పనిచేసుకునేందుకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అవకాశాలుంటున్నాయి. దీంతోపాటు డిగ్రీ తర్వాత ఉపాధి పొందే స్కిల్ కోర్సులు నేర్చుకునేందుకు రాజధాని వేదికగా మారింది.

**బీకాం వైపే విద్యార్థుల చూపు**

ఇప్పటి వరకూ దోస్త్ ద్వారా ఎక్కువ మంది బీకాం కోర్సులోనే చేరారు. 1,41,590 మంది వివిధ కోర్సుల్లో చేరితే, ఇందులో అత్యధికంగా బీకాంలో 54,771 మంది చేరారు. ఆ తర్వాత బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 27,059 మంది చేరారు. బీఏ కోర్సులో 60,414 సీట్లు ఉంటే, చేరిన విద్యార్థులు 19,104 మాత్రమే. ఇటీవల కాలంలో బీబీఏ కోర్సుకు కొంత ఆదరణ పెరిగింది. ఈ కోర్సులో 11,462 మంది చేరారు. సంప్రదాయ డిగ్రీ కోర్సులతోపాటు కంప్యూటర్ కాంబినేషన్ ఉన్న కోర్సులకు మాత్రం విద్యార్థులు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు.

**ఈ పరిస్థితికి కారణమేంటి?**

దశాబ్దాల క్రితం సంప్రదాయ డిగ్రీ కోర్సులే ఎక్కువ. దీనిని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కాలేజీలు, సీట్ల సంఖ్య పెంచుకుంటూ వస్తున్నారు. అయితే, మార్కెట్‌లో వస్తున్న మార్పులను మాత్రం ఉన్నత విద్యామండలి గుర్తించడం లేదు. కోర్సుల ఆడిట్ చేపడితే ఏయే కోర్సులు అవసరమనేది అర్థమవుతుంది. డిగ్రీ తర్వాత ఉపాధి పొందాలన్నా నైపుణ్యం ముఖ్యం. ఆ దిశగా కోర్సుల సిలబస్ తీర్చిదిద్దుతామని మండలి అనేక ప్రయత్నాలు చేసింది. ఇది పెద్దగా ముందుకు పోలేదు. కొన్నేళ్లుగాం డిగ్రీలో 2.20 లక్షల మందికి మించి చేరడం లేదు. అలాంటప్పుడు 4.60 లక్షల సీట్లు ఎందుకు? ఏ కోర్సులు అవసరం లేదు? అనే దిశగా ఉన్నతవిద్య విభాగం ఆలోచించడం లేదు.

**రీ డిజైన్ చేస్తాం**

కాలానుగుణంగా విద్యావ్యవస్థ లోనూ మార్పులు వస్తున్నాయి. డిగ్రీ చదివిన ప్రతీ విద్యార్థి నైపుణ్యంతో ఉపాధి పొందాల్సిన అవసరం ఉంది. దురదృష్టవశాత్తు ఇప్పటి వరకూ ఈ దిశగా జరిగిన కసరత్తు తక్కువే. వచ్చే ఏడాది నుంచి డిమాండ్ కోర్సులు, వాటిల్లో అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకొచ్చే దిశగా ఉన్నత విద్యామండలి ప్రయత్నించాలనే లక్ష్యంతో ఉంది. %–% ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

**ఆదరణలేని కోర్సులతో ఉపయోగం ఏమిటి?**

చాలా కోర్సులకు దశాబ్ద కాలంగా ఆదరణ తగ్గింది. కొన్ని కాలేజీల్లో కొన్ని కోర్సుల్లో ఐదారుగురు కూడా చేరే పరిస్థితి ఏర్పడింది. బీకాం, బీఎస్సీ, లైఫ్‌సైన్స్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కోర్సులపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరగాలి. అవసరం లేని కోర్సులు తగ్గించాలి. డిమాండ్ ఉన్నవి పెంచాలి. అప్పుడే సమతుల్యత సాధ్యం. %–% వేదుల శాంతి, కేశవ మెమోరియల్ కాలేజీ ప్రిన్సిపాల్

# జనాభా లెక్కలు.. వెబ్ పోర్టల్ ద్వారా స్వీయ గణన



**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది నుంచి దేశవ్యాప్తంగా జనాభా లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. జన గణన కోసం ఈసారి కొత్తగా వెబ్ పోర్టల్ ఆవిష్కరిస్తున్నారు. అయితే ఆ పోర్టల్ ద్వార పౌరులు స్వయంగా జనగణనలో పాల్గొనవచ్చు. రెండు దశల్లో జరిగే జనాభా లెక్కింపులో ఆ ప్రక్రియ అందుబాటులో ఉండనున్నది. దేశవ్యాప్తంగా తొలిసారి డిజిటల్ పద్ధతిలో జనాభా లెక్కలు జరగనున్నాయి. ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లలో మొబైల్ అప్లికేషన్స్ ద్వారా లెక్కింపు అధికారులు పౌరుల డేటాను సేకరించనున్నారని అధికారులు తెలిపారు. దేశంలో తొలిసారి స్వీయ గణను విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు. దీని కోసం ప్రత్యేకమైన వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేశామన్నారు. రెండు దశల లెక్కింపులో స్వీయ గణన ఉంటుంది. హౌజింగ్ సెన్సెస్, పాపులేషన్ ఎన్యుమరేషన్ వేళ ఆ డిజిటల్ ప్రక్రియ అందుబాటులో ఉండనున్నది. జనాభా లెక్కల ప్రక్రియను ఆధునీకరించేందుకు డిజిటల్ సెన్సెస్ నిర్వహించనున్నారు. టెక్నాలజీ ద్వారా తొలిసారి డేటాను సేకరించనున్నారు. దాన్ని ఎలక్ట్రానిక్ పద్ధతిలో సెంట్రల్ సర్వర్‌కు చేరవేస్తారు. దీని వల్ల జనాభా లెక్కలకు చెందిన సమగ్ర డేటా తొందరగా అందుబాటులోకి వస్తుందని ఓ అధికారి తెలిపారు. డేటా సెక్యూర్టీ కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. డేటా సేకరణ, ట్రాన్స్‌మిషన్, స్టోరేజ్ వేళ ఎటువంటి భద్రతా లోపం జరగకుండా చూస్తున్నారు. హౌజ్‌లిస్టింగ్, హౌజింగ్ డేటాను ఏప్రిల్ ఒకటి, 2026 నుంచి సేకరించనున్నారు. ఆ తర్వాత రెండో దశ ఫిబ్రవరి 1, 2027న ప్రారంభం అవుతుంది. రెండో దశలో జనాభా గణన జరుగుతుంది. వచ్చే ఏడాది సేకరించబోయే జనాభా లెక్కల్లో కులగణన కూడా జరగనున్నట్లు అధికారులు చెప్పారు. దేశంలో జనాభా లెక్కలు చేపట్టడం ఇది 16వ సారి అవుతుంది. స్వాతంత్ర్యం తర్వాత 8వ సారి లెక్కిస్తున్నారు. జూన్ 16వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. జన గణన కోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మూడు అంచెల విధానాన్ని అవలంబిస్తున్నారు. ప్రతిదశలో జాతీయ శిక్షకుడు, మాస్టర్ శిక్షకుడు, ఫీల్డ్ ట్రైనర్ ఉంటారు. ఫీల్డ్ ట్రైనర్లు సుమారు 34 లక్షల మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తాడు. జనాభా లెక్కల వేళ కౌంట్ మళ్లీ జరగకుండా ఉండేందుకు ప్రతి బ్లాక్‌కు ఓ ఎన్యుమరేటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సెన్సస్ కమీషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. జిల్లాలు, సబ్ జిల్లాలు, తహసిల్, తాలూకాలు, పోలీస్ స్టేషన్ల యూనిట్లను ఏర్పాటు చేసిన మూడు నెలల తర్వాత సెన్సెస్ ప్రక్రియ మొదలవుతుందని ఆయన తెలిపారు.

# లగేజీ ప్యాక్ చేసుకున్నాం.. సీజేఐ నివాసం ఖాళీ చేస్తున్నాం



న్యూఢిల్లీ: మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్ తనకు కేటాయించిన అధికారిక బంగ్లాను ఇంకా ఖాళీ చేయలేదు. కాలపరిమితి దాటినా ఆయన ఆ ఇంటి నుంచి వెళ్లిపోవడం లేదు. దీంతో విసుగెత్తిన సుప్రీంకోర్టు.. రెండు రోజుల క్రితం కేంద్రానికి లేఖ రాసింది. మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్‌పై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. ఇంట్లో ఉన్న లగేజీ మొత్తం ప్యాక్ చేసుకున్నామని, త్వరలోనే భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి మరో ప్రభుత్వ కిరాయి ఇంటికి వెళ్లనున్నట్లు చెప్పారు. చంద్రచూడ్ భార్య కల్పన కాగా, ఆ జంటకు ఇద్దరు కూతుళు ఉన్నారు. ఆ ఇద్దరూ దివ్యాంగులే. అయితే సీజేఐగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి న్యూఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్ 5లో ఆయన నివాసం ఉంటున్నారు. తనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాలో ఎందుకు ఎక్కువ సమయం ఉండాల్సి వస్తుందో డీవై చంద్రచూడ్ చెప్పారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఉన్న లగేజీని ప్యాకప్ చేశామని, కొంత లగేజీ కొత్త ఇంటికి తరలించామని, కొంత స్టోర్‌రూమ్‌లో ఉందన్నారు. సీజేఐ డీవై చంద్రచూడ్ 2024, నవంబర్ 8వ తేదీన రిటైర్ అయ్యారు. బంగ్లా ఎక్స్‌టెషన్ గురించి పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. అయితే తన కూతుళ్లు దివ్యాంగులని, వాళ్లు ఎప్పుడూ వీల్‌చైయిర్‌లో ఉంటారని, వాళ్ల ఆరోగ్యం దృష్ట్యా .. బంగ్లా ఖాళీ చేయడం ఆలస్యం అయ్యిందన్నారు. కూతుళ్లు ప్రియాంకా, మహి.. వింత వ్యాధితో బాధపడుతున్నారని, వాళ్ల అవసరాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయని, కూతుళ్లు ఇద్దరికీ నిమలైన్ మయోపథి అనే వ్యాధి ఉందని, జన్యుపరమైన ఆ వ్యాధి వల్ల వాళ్ల ఎముక మాంసం దెబ్బతింటుందన్నారు. ఇంట్లో ఉన్నప్పుడు వాళ్లకు చాలా ఉన్నత ప్రమాణాలతో ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని, ప్రత్యేకమైన నర్సులు వాళ్లను చూసుకుంటారని, కూతుళ్లకు అనువైన రీతిలో ఉండే ఇంటి కోసం వెతికామని, కానీ ఢిల్లీలో అలాంటి ఇళ్లు దొరకడం లేదని, ఇద్దరు కూతుళ్లను చూసుకోవాల్సిన బాధ్యత తమమీదే ఉందన్నారు. అయితే కొత్త ఇళ్లు పూర్తి అయిన సమాచారం అందగానే ఆ ఇంట్లోకి వెళ్లనున్నట్లు జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. తన పెద్ద కూతురు ప్రియాంకా.. 44 రోజుల పాటు ఐసీయూలో చికిత్స పొందినట్లు చెప్పారు. షిమ్లాలో హాలీడే కోసం వెళ్లినప్పుడు ఆ అమ్మాయి చాలా ఇబ్బందిపడినట్లు తెలిపారు. ట్రాచెస్టమీ ట్యూబ్‌తో ఆమె చికిత్స జరుగుతోందన్నారు. తమ కూతుళ్లకు నిరంతరం ఛాతి, శ్వాసకోస, నరాల సంబంధిత థెరపీ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు రెగ్యులర్‌గా పెయిన్, స్పీచ్ చికిత్స కూడా జరుగుతోందన్నారు. గతంలో మాజీ సీజేఐలు కూడా అధికార నివాసాల్లో ఎక్స్‌టెన్షన్ తీసుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. సీజేఐ యూయూ లలిత్, ఎన్వీ రమణ తో పాటు ఇతర టాప్ జడ్జీలు ఆ అవకాశాన్ని వాడుకున్నట్లు చంద్రచూడ్ చెప్పారు. రిటైర్మెంట్ సమయంలో జరిగిన పరిణామాల గురించి జస్టిస్ చంద్రచూడ్ వివరిస్తూ.. తన తర్వాత బాధ్యతలు స్వీకరించిన సీజేఐ సంజీవ్ ఖన్నాతో బంగ్లాను ఖాళీ చేసే అంశాన్ని మాట్లాడినట్లు చెప్పారు. సీజేఐ బంగ్లాలోనే కొనసామని జస్టిస్ ఖన్నా తనకు చెప్పినట్లు చంద్రచూడ్ తెలిపారు. ఎందుకంటే జస్టిస్ ఖన్నా ప్రభుత్వ బంగ్లాలో ఉండాలనుకోలేదన్నారు. ఖన్నా హామీ నేపథ్యంలో చంద్రచూడ్ అక్కడే ఉంటున్నారు. రిటైర్మెంట్ తర్వాత కేవలం ఆర్నెళ్ల వరకే ఎక్స్‌టెన్షన్ ఉంటుంది. కానీ ఈ ఏడాది మే 31 వరకు అదనంగా పొడిగింపు ఇచ్చారు. ఆ కాలపరిమితి దాటడంతో చంద్రచూడ్‌ను బంగ్లాను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ కేంద్రానికి సుప్రీం లేఖ రాసింది.

## మెట్రో'లో జనం కిటకిట.. తొక్కిసలాట భయంలో..



మహారాష్ట్రలోని ముంబై మెట్రోలో సోమవారం ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ముంబై మెట్రో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సాంకేతిక లోపం కారణంగా మెట్రో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నందున ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. వెర్సోవా ఘట్కోపర్ లైన్ వన్‌లో మెట్రో రాకపోకల్లో జాప్యం జరుగుతున్నదన్నారు. ప్రయాణికుల విపరీతమైన రద్దీ కారణంగా ఘాట్కోపర్ స్టేషన్‌లో తొక్కిసలాట తరహా పరిస్థితి ఏర్పడిందని, త్వరగా చర్యలు తీసుకోవాలని ఒక యూజర్ 'ఎక్స్' ప్లాట్‌ఫారంలో కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ మెట్రో కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ముంబై మెట్రో రద్దీపై సోషల్ మీడియా యూజర్స్ పలు రకాలుగా కామెంట్లు చేస్తున్నారు. కొందరు ఈరోజు ఆఫీసుకు వెళ్లలేమని, వర్క్ ఫ్రమ్‌హోమ్ కావాలని బాస్‌లకు మెసేజ్ పెట్టామని తెలిపారు. ప్రభుత్వం ముంబైలోని రైలు సేవలపై దృష్టి సారించాలని పలువురు కోరారు.

# భారత్, పాక్‌ను ఒకే త్రాసులో తూకం వేయలేం



జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పొరుగుదేశం పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. పాక్ ఉగ్రవాద మద్దతుదారని, భారత్ ఉగ్రవాద బాధిత దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేమన్నారు. 'పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తోంది. భారత్ మాత్రం ఉగ్రవాద బాధితురాలిగా ఉంది. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేం' అని ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మౌనంగా మద్దతు ఇవ్వడం కూడా ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంలో భారతదేశానికి మద్దతుగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

**పహల్గాం ఉగ్ర దాడిని ఖండించిన బ్రిక్స్..**

బ్రెజిల్‌లోని రియో డీ జెనీరలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్ర దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రదాడులు ఎక్కడ జరిగినా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని, టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్యదేశాలు విడుదల చేశాయి. 'ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం. క్రాస్ బార్డర్ టెర్రరిజంతోపాటు ఉగ్రమూకలకు నిధులు అందిస్తూ, ఆశ్రయం కల్పించడాన్ని ఖండిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కలిసికట్టుగా ముందుకు వెళ్తాం. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరు ప్రస్తావించలేదు.

## ఎఫ్అండ్‌వో హస్తలాఘవంపై మోదీ మౌనం

దిల్లీ

సామాన్య మదుపరులను ముంచేలా స్టాక్ మార్కెట్లోని ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో (ఎఫ్అండ్‌వో) పెద్ద పెట్టుబడిదారులు హస్తలాఘవానికి పాల్పడటంపై ప్రధాని మోదీ మౌనం దాలుస్తున్నారని, దీనివల్ల సంపన్నులు మరింత సంపన్నులుగా మారుతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఎఫ్అండ్‌వోలో పలు లొసుగులు ఉన్నాయని తాను గతంలోనే హెచ్చరించానని తెలిపారు. 'ఎఫ్అండ్‌వో మార్కెట్ పెద్ద పెట్టుబడిదారులకు ఆటస్థలంగా మారిందని 2024లోనే నేను చెప్పా. దీనివల్ల సామాన్య మదుపరుల జేబులు ఖాళీ అవుతున్నాయని హెచ్చరించా. దానిని నిజం చేస్తూ జేన్ స్ట్రీట్ గ్రూపు వేల కోట్ల రూపాయల హస్తలాఘవానికి పాల్పడిందని ఇప్పుడు సెబీ చెబుతోంది. మరి ఇంతకాలం పాటు సెబీ దీనిపై మౌనంగా ఎందుకు ఉంది' అని సోమవారం ఎక్స్‌లో రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుంభకోణం బయటపడ్డాకా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇలాంటి మరిన్ని రిగ్గింగ్‌లు మార్కెట్లో జరిగితే పరిస్థితేంటని నిలదీశారు. 'ఎవరి ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది. ఇంకా ఎన్ని పెద్ద తిమింగలాలు.. సామాన్య మదుపరులను ముంచనున్నాయి.. ఇలాంటి ప్రతి కేసులోనూ మోదీ ప్రభుత్వం.. సంపన్నులను మరింత సంపన్నులను చేస్తోంది' అని రాహుల్ ఆరోపించారు. నియంత్రణలేని ఎఫ్అండ్‌వో ట్రేడింగ్.. ఐదేళ్లలో 45 రెట్లు పెరిగిందని, 90శాతం మంది చిన్న మదుపరులు 1.8 లక్షల కోట్లు నష్టపోయారని తాను గతంలో పెట్టిన పోస్టును రాహుల్ దీనికి జత చేశారు. ఎఫ్అండ్‌వోలో ఉన్న పెద్ద పెట్టుబడిదారుల పేర్లు వెల్లడించాలని సెబీని డిమాండు చేశారు.

## నా యాత్ర క్షేమంగా సాగడానికి కృషి చేశారు

భారత ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్‌కు కీలకమైన సమాచారాన్ని అందిస్తూ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్‌తో మాట్లాడారు. యాక్సియమ్-4 (ఏఎక్స్-4) మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుక్లా, జూలై 6న ఇస్రో ఛైర్మన్‌కు ఫోన్ చేసి తన ఆరోగ్యం, మిషన్ పురోగతి, నిర్వహిస్తున్న శాస్త్రీయ ప్రయోగాల గురించి వివరించినట్లు ఇస్రో సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సంభాషణ సందర్భంగా, శుక్లా చేపడుతున్న ప్రయోగాల గురించి ఛైర్మన్ నారాయణన్ ఆరా తీశారు. మిషన్ పూర్తయ్యాక సవివరమైన డాక్యుమెంటేషన్ అందించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. ఈ మిషన్ నుంచి లభించే పరిశోధనలు, ఫలితాలు భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న గగన్‌యాన్ మానవసహిత అంతరిక్ష యాత్రకు అత్యంత కీలకం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ చర్చలో ఇస్రోకు చెందిన పలువురు సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం తాను ఐఎస్ఎస్‌లో నిర్వహిస్తున్న శాస్త్రీయ అధ్యయనాల లక్ష్యాలు, ఎదురవుతున్న సవాళ్లపై శుక్లా వారికి అప్‌డేట్స్ ఇచ్చారు. ఈ మిషన్‌కు ఇస్రో నిరంతరం మద్దతు అందిస్తుందని నారాయణన్ పునరుద్ఘాటించారు. ప్రయోగానికి ముందు శుక్లాకు మార్గనిర్దేశం చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా, మిషన్ సంసిద్ధతలో భాగంగా స్టాండ్‌బై వ్యోమగామిగా ఉన్న ప్రశాంత్ బాలన్ నాయర్‌తో కూడా ఇస్రో అధికారులు నిరంతరం చర్చిస్తున్నట్లు తెలిపారు.

## 'మహా'తీరంలో పాక్ నౌక? అంతటా హై అలర్ట్



ముంబై: మహారాష్ట్ర తీరంలో కలకలం చెలరేగింది. భారత నావికాదళ రాడార్ సముద్రంలో ఒక అనుమానాస్పద నౌకను గుర్తించగా, అది పాకిస్తాన్ ఫిషింగ్ నౌక అయివుండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రేవ్‌దండా తీరం సమీపంలో ఈ అనుమానాస్పద నౌక కనిపించిన దరిమిలా మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ తీరం వెంబడి భద్రతను మరింతగా పెంచారు. తీరం వెంబడి పోలీసు దళాలను మోహరించారు. ముందు జాగ్రత్త చర్యగా రాయగఢ్ జిల్లాలో భద్రతను పెంచారని ఒక అధికారి తెలిపారు. ఆదివారం రాత్రి భారత నావికాదళ రాడార్ రేవ్‌దండాలోని కొర్లై తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో అనుమానస్పద నౌకను గుర్తించింది. ప్రస్తుతం పోలీసులు, సముద్రతీర భద్రతా సిబ్బంది ఆ నౌక కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. రాయ్‌గడ్ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ), బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ (బీడీడీఎస్), నేవీ కోస్ట్ గార్డ్ సిబ్బంది అనుమానాస్పద నౌక ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. రాయ్‌గడ్ పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) అంచల్ దలాల్, ఇతర సీనియర్ పోలీసు అధికారులు తీరానికి చేరుకున్నారు. ఆ నౌకను చేరుకునేందుకు అధికారులు ప్రయత్నించారు. అయితే వాతావరణం అనుకూలంగా లేని కారణంగా వారు వెనుదిరిగారు. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా పడవను గుర్తించి, దానిని చేరుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావడం లేదు.

## అవును.. నేను పాక్ ఆర్మీ ఏజెంట్‌నే

26/11 ముంబయి ఉగ్రదాడుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవూర్ హుస్సేన్ రాణా తన నేరాన్ని అంగీకరించాడు. అంతేకాదు.. పాకిస్తాన్ ఆర్మీకి అత్యంత విశ్వసనీయమైన ఏజెంట్‌గానూ తాను పనిచేశానని విచారణలో వెల్లడించాడు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సోమవారం ఓ కథనం ప్రచురించింది. ముంబై ఉగ్రదాడుల కేసులో అమెరికా నుంచి అప్పగింత మీద వచ్చిన రాణా.. ప్రస్తుతం ఢిల్లీ తిహార్ జైలులో %చీ×ూ% కస్టడీలో ఉన్నాడు. అయితే ముంబై క్రైమ్ బ్రాంచ్ విచారణలో 2008 ముంబై ఉగ్రదాడుల్లో తన ప్రేమయం ఉన్నట్లు అంగీకరించాడు. అంతేకాదు తాను, తన మిత్రుడు డేవిడ్ హెడ్‌లీతో కలిసి లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ ద్వారా పలు శిక్షణా శిబిరాల్లో పాల్గొన్నట్టు వెల్లడించాడు. లష్కరే తోయిబా కేవలం ఉగ్రవాద సంస్థ మాత్రమే కాదని ప్రధానంగా ఓ గూఢచార సంస్థలా పనిచేస్తుందని తహవూర్ రాణా వెల్లడించినట్లు తెలుస్తోంది. ముంబైలో ఇమ్మిగ్రేషన్ సెంటర్‌ను ఓపెన్ చేయాలన్న ఆలోచన తనదేనని, ఆ కార్యాలయం ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలను వ్యాపార ఖర్చులుగా చూపించానని, 2008 నవంబర్‌లో జరిగిన ముంబయి దాడుల సమయంలో తాను ముంబయిలోనే ఉన్నానని, అది ఉగ్రవాదుల ప్రణాళికలో భాగమే అని అంగీకరించాడు. దాడులకు ముందు ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ వంటి ప్రదేశాలను స్వయంగా పరిశీలించినట్టు తెలిపాడు. అంతేకాదు.. ఈ దాడులు పాకిస్తాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (%×ూ×%) సహకారంతోనే జరిగాయని తాను నమ్ముతున్నట్లు తహవూర్ రాణా వెల్లడించాడు. ఈ మేరకు ఇండియా టుడే ఓ కథనం ప్రచురించింది. ఇదిలా ఉంటే.. ముంబై దాడుల్లో తన ప్రమేయం లేదంటూ రాణా ఇప్పటిదాకా బుకాయిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. కానీ తాజా విచారణలో తన పాత్రను అంగీకరించడంతో పాటు పాక్ నిఘా వ్యవస్థ ప్రేమయం ఉండొచ్చన్న వ్యాఖ్యలు ఈ కేసును కీలక మలుపు తిప్పేలా కనిపిస్తున్నాయి.

# ఆటల లోకానికి అంకితం చేసిన డిజిటల్ ఉత్సవం

డిజిటల్ పరిజ్ఞాన శతాబ్దంలో మానవ జీవితానికి వినోదం అనేది ఒక అంతర్భాగంగా మారింది. ఈ విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన అంశాల్లో వీడియో గేమ్‌లు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. వీడియో గేమ్‌లు సమాజాన్ని, టెక్నాలజీని, మనుషుల ఆలోచనా ధోరణిని మారుస్తున్న సాధనాలు. అవి వినోదాన్ని మాత్రమే కాకుండా, విద్యా, శిక్షణ, పరిశోధనా రంగాలలోనూ వాడబడు. తున్నాయి ఒకప్పుడు బాలల ఆటలుగా మాత్రమే భావించ బడిన వీటి ప్రాధాన్యం, కాలక్రమేణా అనేక మార్గాల్లో విస్తరించింది. టెక్నాలజీ, విజ్ఞానం, కళ, వ్యాపారం, విద్య – ఇలా అన్ని రంగాలను స్పర్శిస్తూ ఒక ఆధునిక సంస్కృతి రూపంలో అభివృద్ధి చెందాయి. ఈ పరిణామాన్ని గుర్తించి, వీడియో గేమింగ్ రంగానికి అంకితంగా ప్రతి సంవత్సరం జూలై 8న 'జాతీయ వీడియో గేమ్‌ల దినోత్సవం' నిర్వహించ బడుతోంది. వీడియో గేమ్ అనే పదం వింటేనే యువతలో ఉత్సాహం తారస్థాయికి చేరుతుంది. వీడియో గేమ్ అనే భావనకు మౌలిక రూపం దాదాపు ఏడున్నర దశాబ్దాల క్రితం ఏర్పడింది. 1958లో అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త విలియం హిగిన్బోథమ్ రూపొందించిన 'టెన్నిస్ ఫర్ టూ' అనే సాధారణ ఆట, ప్రాథమిక వీడియో గేమ్‌గా గుర్తించ బడింది. 1972లో 'అటారి' అనే సంస్థ రూపొందించిన 'పాంగ్' అనే ఆట ఖతీఝ్మువ గేమ్ ప్రపంచాన్ని సంచలనానికి లోను చేసింది. అదే ప్రారంభం. ఆ తర్వాత గేమింగ్ రంగం గణనీయమైన పురోగతిని సాధించింది. 1980ల నాటికి నింటెండో, సెగా వంటి బ్రాండ్ల ద్వారా 'సూపర్ మారియో', 'డాంకీ కాంగ్', 'పాక్–మ్యాన్', 'టెట్రిస్' వంటి గేమ్‌లు ఇంటింటికీ చేరాయి. మూడవ దశలో సోనీ ప్లేస్టేషన్, మైక్రోసాఫ్ట్ శఎశీఞ, నింటెండో ఔఱఱ వంటి గేమ్ కన్సోల్స్ ద్వారా గేమింగ్ ప్రపంచం మరో కొత్త దశలోకి ప్రవేశించింది. ఈ రోజుల్లో వీడియో గేమింగ్ కేవలం ఆటలకే పరిమితం కాకుండా, ఒక నైపుణ్య రంగంగా మారింది. ఆధునిక సాంకేతికత – గ్రాఫిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి పరిజ్ఞానాలతో వీడియో గేమ్స్ మానవ అనుభూతిని తాకే స్థాయికి చేరాయి. ఆన్‌లైన్ మల్టీప్లేయర్ గేమింగ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గేమర్లతో ప్రత్యక్ష అనుసంధానం ఏర్పడుతోంది. మొబైల్ ఫోన్, క్లౌడ్ గేమింగ్ ద్వారా ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా గేమ్ ఆడే అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. సృజనాత్మకత, తర్క శక్తి, సమస్యల పరిష్కరణ నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయ పడతాయి.తాత్కాలిక ఒత్తిడిని తగ్గించడంలో, మానసిక ఉల్లాసం కలిగించడంలో వీడియో గేమ్‌లు పాత్ర పోషిస్తాయి.గేమ్స్ ద్వారా విద్యను ఆకర్షణీయంగా మార్చడంలో ఉపయోగ పడుతున్నాయి.



వీడియో గేమ్‌లు సమాజంలో పలు విధాలుగా ప్రభావం చూపిస్తున్నాయి. శిశువయసు నుంచే సృజనాత్మకతను, వ్యూహాత్మక ఆలోచనను, తర్క సామర్థ్యాన్ని పెంపొందించే సాధనాలుగా ఇవి మారాయి. చురుకైన చేతి–కంటి సమన్వయం, వేగవంతమైన స్పందనలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలు – ఇవన్నీ కొంతవరకు వీడియో గేమింగ్ ద్వారా అభివృద్ధి చెందుతాయన్న విషయం పరిశోధనల ద్వారా తేలింది. అంతేగాక, విద్యా రంగంలోనూ గేమ్‌ల వినియోగం పెరుగుతోంది. భౌతికశాస్త్రం, గణితం, చరిత్ర వంటి అంశాలను ఆకర్షణీయంగా బోధించడానికి ఉపయోగపడే విద్యా గేమ్‌లు ప్రస్తుతం మరింత ప్రాచుర్యంలోకి వచ్చాయి. కళా రంగంలోనూ గేమ్‌లు విశేష ప్రభావం చూపుతున్నాయి. కథా నిర్మాణం, గ్రాఫిక్ డిజైన్, సౌండ్ ఇంజనీరింగ్ వంటి అంశాల సమన్వయంతో గేమ్‌లు కళాఖండాల్లా రూపుదిద్దు కుంటున్నాయి. అంతేగాక, వీడియో గేమ్ పరిశ్రమ ఈ యేటికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 220 బిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థగా మారిన సంగతి గణాంకాల ద్వారా వెల్లడవుతోంది. భారత దేశంలో గేమింగ్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతూ, 2025 నాటికి 8 బిలియన్ డాలర్ల మార్కెట్‌ను అధిగమించ నున్నట్లు అంచనాలు ఉన్నాయి. వేలాది యువత గేమ్ డెవలప్‌మెంట్, డిజైన్, టెస్టింగ్ వంటి రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. అయితే వీడియో గేమింగ్ అతి ఎక్కువగా వినియోగించడం వల్ల శారీరక నిష్క్రియత, మానసిక ఒత్తిడి, సామాజిక ఒంటరితనం వంటి సమస్యలు ఎదురవుతాయి. ముఖ్యంగా చిన్న పిల్లలపై దీనివల్ల తక్షణ స్పందనల అలవాటు, గమన దోషాలు, హింసాత్మకత వంటి దుష్ప్రభావా లుండవచ్చున్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాబట్టి గేమింగ్ వినియోగంలో సమయపాలన, నియంత్రణ, వయస్సుకు తగిన కంటెంట్ ఎంపిక – ఇవన్నీ అత్యంత అవసరమైన అంశాలు. జూలై 8వ తేదీ ప్రతి సంవత్సరం వీడియో గేమ్‌ల సామర్థ్యాన్ని, ప్రజల్లో అవగాహన పెంచేలా, సమర్థవంతమైన వినియోగాన్ని ప్రోత్సహించేలా జరుపుకోవాలి. ఈ రోజున గేమింగ్ చరిత్రను పరిశీలించడం, ఇష్టమైన ఆటలను ఆడడం, కొత్త గేమ్‌లను ప్రయత్నించడం, గేమ్‌ల రూపకర్తలకు కృతజ్ఞతలు తెలిపేలా సోషల్ మీడియాలో భాగస్వామ్యం కావడం వంటి చర్యల ద్వారా దినోత్సవానికి అర్థవంతమైన రూపాన్ని ఇవ్వవచ్చు. వీడియో గేమ్‌లు కేవలం కాలక్షేపానికి కాదు.. అవి మానవ మేధస్సు ప్రతిభకు, సాంకేతిక విజయానికి ప్రతిరూపంగా నిలుస్తున్నా యి. అవి బాధ్యతాయుతంగా ఉపయోగించబడినపుడు విద్య, విజ్ఞానం, సృజన, సంపద – అన్నింటికి మార్గదర్శిగా మారగ లవు. జూలై 8 – జాతీయ వీడియో గేమ్‌ల దినోత్సవం సంద ర్భంగా ఈ విషయాన్ని మనం మరోసారి గుర్తు చేసుకోవాలి.

# భావనలకు బాణీగా నిలిచిన భాషా ప్రవాహ కవి

తెలుగు సాహిత్య ప్రపంచంలో భావా వేశానికి పద రూపమిచ్చిన రచయితలలో నాయని సుబ్బారావు ప్రముఖులు. కవిగా, ఆలోచనా పరుడిగా, తాత్వికుడిగా, ప్రజా భావ జాలానికి ప్రతినిధిగా ఆయన రచనలు తెలుగు భాషకు ఒక గౌరవ చిహ్నంగా నిలిచాయి. 1899 అక్టోబరు 29 న ప్రకాశం జిల్లాలోని పొదిలి పట్టణంలో జన్మించిన ఆయన, సాహిత్యరంగంలో విశేష గౌరవం సంపాదించారు. ఆయన విద్యాభ్యాసం ఎంతోమంది సంపన్నుల సౌకర్యాలతో జరిగిన విద్య కాదు. ఎక్కువగా స్వయం కృషితో, అధ్యయనానికే జీవితం అంకితం చేసిన సుబ్బారావు బహుముఖ విజ్ఞానం ఆయన రచనల్లో ప్రతిఫలిస్తూ, భాషా శిల్పానికి భిన్నమైన విలువలు జతచేసింది. నాయిని రచనలు ఆలోచనాత్మకతకు, భావోద్వేగాలకు, తాత్వికతకు ప్రతిరూపంగా నిలుస్తాయి. ఆయన పదాల పరిమళం గుండెను తాకే సౌమ్యతతో కూడినదీ, ఆలోచనలను కదిలించే మాధుర్యంతో కూడినదీ. ప్రకృతి, ప్రేమ, భక్తి, మానవ సంబంధాలు, సామాజిక విలువలు వంటి అంశాలపై ఆయన కలం సాగింది. ఆయన రచనల్లో తెలుగు నేల ఆత్మ స్పష్టంగా ప్రస్ఫుట మవుతుంది. ఆంగ్ల కవుల ప్రభావం ఉన్నప్పటికీ, ఆయన మాటల్లో భారతీయత పుష్కలంగా పరవళ్లు తొక్కుతుంది. 1937లో వెలువడిన 'సౌభద్రుని ప్రణయ యాత్ర' కావ్యం సాహిత్య ప్రపంచానికి పరిచయమైన నాయిని తొలి ప్రథిత రచన. ఇది ప్రేమ భావోద్వేగాన్ని తేటతెల్లంగా, శిల్ప సంపన్నంగా ఆవిష్కరించిన కవిత్వ మణి కూటమి. ఆ తరువాత వచ్చిన 'మాతృ గీతాలు' (1939) మాతృ భక్తికి అక్షర రూపం. 'వేదనా వాసు దేవము' (1964) జీవన వేదనను నిశ్శబ్దంగా పలికించిన భావసంపన్న గాథ. 'విషాద మోహనము' (1970) లో విరహ వేదన, నిస్సహాయత లాంటి సూక్ష్మ మానసికా నుభూతులను మృదువుగా పాఠకుల హృదయాలలో జాగృతం చేశాయి. 1973లో వెలువడిన "జన్మభూమి" అనే మహాకావ్యం దేశభక్తికి అక్షర రూపంగా నిలిచింది. తల్లి భూమిపట్ల ప్రేమ, సమాజ బాధ్యత, దేశ సంఘర్షణలు, ప్రజాస్వామ్య విలువల ప్రతిబింబం వంటి అంశాల సమ్మిళిత రూపం ఈ కావ్యం. ఇది కేవలం కావ్యం మాత్రమే కాదు, భావజాల స్ఫూర్తికి ఒక అక్షర సాక్ష్యం. ఆయన రచనా శైలిలో గంభీరత, సరళత, భావసారంతో కూడిన పద ప్రయోగం, శబ్ద సౌందర్యం, భావలాలిత్యం కనిపిస్తాయి. ముఖ్యంగా ఆయన పదాలు %–% పాఠకులలో ఓ అంతర్మథనను, ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగించే శక్తితో నిండినవిగా ఉంటాయి. భావోద్వేగాలు ఆయన కలంలో కదిలే నీరువంటి శుభ్రమైన ప్రవాహంగా పాఠకుని మనసును తడిపేస్తాయి. విశిష్టమైన కవితా సంపదతో పాటు, ఆయన అనేక ముఖ్య రచనలు చేస్తూ తెలుగు సాహిత్యాన్ని దృఢ పరిచారు. 'సౌందర్య లహరి' అనే అనుసృజనాత్మక కావ్యం ద్వారా శంకరాచార్యుల తాత్వికతను తానెరగిన మానసిక ధోరణితో సమన్వయం చేస్తూ మాతృ దేవత భావాన్ని మేల్కొలిపారు. 'విషాద గానం' ఆయన మానవతా విలాపానికి అక్షర రూపం.



'నయనానందం' అనే పద్య సంపుటి, 'కొండవీటి చాటువులు' వంటి హాస్య వ్యంగ్య పద్యాలు నాయిని రచనా వైవిధ్యానికి ప్రతీకలుగా నిలిచాయి. సాహిత్య రచనలతో పాటు, నాయిని స్వాతంత్ర్య ఉద్యమానికి తనదైన పాత్ర పోషించారు. తెలంగాణ సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన, స్వేచ్ఛా భావాన్ని సాహిత్యం లోనూ బలంగా వ్యక్తీకరించారు. పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌కు చేరి, ఆకాశవాణిలో రచయితగా అనేక నాటికలు, ప్రబంధా లు, గ్రామీణ కళా పథాలపై వ్యాసాలు రాశారు. ఆయన వాక్యాలు గ్రామ జీవితాన్ని సజీవంగా చిత్రీకరించాయి. పత్రికల్లో "భాగ్యనగర కోకిల" అనే శీర్షికతో వెలువడిన 25 ఖండికలు ఆయన హాస్య చాతుర్యాన్ని, విమర్శక దృష్టిని, నగర జీవితం పట్ల ఉన్న భావదోష నివారణ ప్రయత్నాన్ని ప్రతిబింబించాయి. అభ్యుదయ భావాలతో కూడిన వ్యాఖ్యలు, ప్రజాస్వామ్యంపై ఉన్న నమ్మకాన్ని చాటి చెప్పే రచనలు నాయినిని ఓ భావవేత్తగా నిలబెట్టాయి. నాయని సుబ్బారావు రచనల ప్రభావం కేవలం ఆయన కాలానికి మాత్రమే పరిమితమై ఉండలేదు. ఆవిధంగా ఆయన కలం ఒక తరం భావ జాలాన్ని నిర్మించింది. ఆయన రచనలు పాఠకుడి అంతఃకరణాన్ని చలించగల శక్తిని కలిగి ఉండటమే కాక, సమకాలీన సంఘటనలకు స్పందించే సామర్థ్యాన్ని కలిగి ఉండేవి. 1930– 1970ల మధ్య తెలుగు సాహిత్యంలో భావ కవిత్వానికి, వ్యక్తిగత అనుభూతులకూ, సామాజిక బాధ్యతకూ మధ్య ఉన్న గల తూలిక బరువును సమతుల్యంగా మోయగల రచయితలలో నాయిని ముందువరసలో నిలిచారు. తన రచనల ద్వారా ఆయన భావ ప్రకటనకు మాత్రమే కాదు, భావ ప్రభావానికి కూడా మార్గదర్శిగా నిలిచారు. ఆయన వాక్యాల్లో కనిపించే భావ గంభీరత పాఠకుని మనసును వెంటాడుతుంది. ఆయన పదబంధాలు అనుకరణకు కాకుండా, అన్వేషణకు ప్రేరణలుగా మారతాయి. సాహిత్యంలో వినోదం, వివేకం, విలాపం, వేదన అన్నీ ఆయన కలంలో మౌన రాగాలవలె ఉంటాయి. తాను జీవించిన కాలంలో రాజకీయ, సాంస్కృతిక, విద్యా రంగాల్లో నాయిని అభిప్రాయాలు విలువైనవి. ప్రత్యేకించి విద్యా. వ్యవస్థపై, ఉపాధ్యాయుల బాధ్యతలపై ఆయన అభిప్రాయాలు ఎంతో ప్రాసంగికంగా నిలిచాయి. "విద్యకు వికాసం ఉండాలి, శిష్యుని హృదయంలో సద్బుద్ధి పూతల్ని నాటే గురువు కావాలి" అన్నది ఆయన నమ్మకం. విద్యార్థుల్లో క్రమశిక్షణ, చింతనశక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి అనన్యం. ఆయన కాలంలో అభివృద్ధి చెందిన హైబ్రిడ్ సాహిత్య ప్రక్రియల మధ్య నాయిని రచనలు తమ స్థిరత్వాన్ని, విలువను నిలబెట్టు కున్నాయి. భావకవిత్వం లోనూ, తాత్విక ప్రసంగాల్లోనూ, హాస్య రచనలూ కూడా ఒకే వ్యక్తిత్వాన్ని పాఠకుడికి గుర్తు చేస్తాయి. ఇదే నాయిని రచనా శైలికి ముఖ్యమైన లక్షణం – భావాల ఏకత్వం, భావోద్వేగాల సమన్వయం. నాయిని హాస్యవ్యంగ్య రచనల విషయం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గది. 'కొండవీటి చాటువులు' వంటి సంకలనాలలో ఆయన చూపిన సామాజిక పరిష్కార దృష్టి, సామాన్యుని భావాలను హాస్యంతో వ్యక్తీకరించగల సామర్థ్యం ఒక విలక్షణత. ఆయన చాటువుల్లో పదాల సరస్యం, సందర్భానికి తగ్గ వాడకం, వ్యంగ్య ఛాయలు నాటకీయంగా పలికేలా ఉంటాయి. ఈ శైలిని ఆయన వ్యక్తిత్వ శైలిగా మార్చుకున్నారు. అంతేగాక, తెలుగు సాహిత్యంలో తాత్వికత, ఆధ్యాత్మికతను కలగలిపే ప్రయత్నంలోనూ ఆయన ముందుండేవారు. 'సౌందర్యలహరి' అనుసృజనలో ఆయన వ్యక్తీకరించిన దేవీభక్తి, రూపసౌందర్యాల చిత్తరేఖలు కేవలం పౌరాణిక గాథలు కాకుండా, అహంకార–అభిమానం మధ్య భక్తిని ప్రతిబింబించే మానసిక ప్రయాణంగా నిలిచింది. తెలుగు భాషాభిమానులూ, సాహితీ విద్యార్థులూ నాయిని రచనలు చదవాలి అనే ఆవశ్యకత ఇప్పటికీ ఉంది. ఆయన రచనలలో ఆవేశం లేదు, విశ్లేషణ ఉందిబీ అలంకారాలు ఎక్కువ కావు, అర్థ గంభీరత అధికంగా ఉంటుందిబీ వ్యక్తిగతత ఉంది కానీ ఆత్మ నిమగ్నత కాదు –ఇవే ఆయన రచనా ధర్మాన్ని ప్రత్యేకంగా నిలబెట్టే లక్షణాలు. ఆయనకు లభించిన "కళాప్రపూర్ణ" బిరుదు, సాహిత్య అకాడమీ గుర్తింపులు, పాఠకుల ప్రశంసలు – ఇవన్నీ నాయిని సాహిత్య సేవకు అద్దం పడతాయి. కానీ అవి ఆయనను నిర్వచించలేవు. ఎందుకంటే ఆయన రచనలు కాలానికి అతీతంగా, భావనకు సమీపంగా ఉన్న మానవీయ అనుభవాల వెల్లవగా నిలుస్తాయి. ఈ తరానికి సాహిత్యాన్ని జీవన శైలిగా అనుసరించే తరం కావాలంటే, నాయిని సుబ్బారావు రచనలు ఒక దిక్సూచి. ఆయన పదాలు – భావనల అక్షర రూపం. ఆయన జీవిత తాత్విక దృక్పథం – మనల్ని ఆలోచింపజేసే మార్గదర్శకం. ఆయన రచనలు – భావాన్ని బలంగా చాటే ఉదాత్త కళారూపం. కుటుంబంగా కూడా నాయిని వారసత్వాన్ని కొనసాగించారు. ఆయన కుమార్తె నాయిని కృష్ణకుమారి ప్రముఖ కవయిత్రిగా, విమర్శకురాలిగా, అనేక అవార్డులు అందుకున్న సాహితీ శక్తిగా వెలుగొందారు. నాయిని సుబ్బారావు 1978 జూలై 8న ఈ లోకాన్ని వీడి అనంతత్వం లోకి ప్రవేశించినా, ఆయన రచనలు తెలుగు పాఠకుల మదిలో చిరకాలం నిలిచి ఉంటాయి.

# అమెరికాకు తల ఒగ్గితే భవిత అయోమయం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2025 జులై 8వ తేదీ నాటికి అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి భారతదేశానికి గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత బృందం, జేమీసన్ గ్రియర్ నేతృత్వంలోని అమెరికా బృందంతో వాషింగ్టన్‌లో 2 రోజుల చర్చలు జరిపింది. గోయల్ రెండు రోజుల క్రితం తిరిగి భారత దేశానికి వచ్చినప్పటికీ, వాణిజ్య కార్యదర్శి ఇంకా అమెరికాలో ఉన్నసమయంలో ట్రంప్ ఏకపక్షంగా భారతదేశంతో ఒక పెద్ద వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించాడు. ఇందులో భారతదేశాన్ని మరింత తెరవాలని స్పష్టమైన సందేశం ఉంది. అయితే వివరాలు ఇంకా వెల్లడించలేదు. ఇది ట్రంప్ 2025 మే 10న ప్రకటించిన అమెరికా –మధ్యవర్తిగా ఇండో –పాక్ కాల్పుల విరమణ, దానితో అనుసంధానించిన అమెరికా– భారత వాణిజ్య ఒప్పంద ప్రకటన కొనసాగింపే. ఇది మరోసారి ఆర్ఎస్ఎస్ ప్రేరేపించిన మోడీ పాలన అమెరికా సామ్రాజ్యవాదానికి చేసిన దౌర్భాగ్యకర నయా వలసవాదానికి తలవంచే విధానాన్ని బయటపెడుతోంది. 2025 ఏప్రిల్ 2న ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక షరతులు, పరిమితులు విధిస్తూ జారీ చేసిన కార్యనిర్వాహక ఆదేశంలో భాగంగా ఉక్కు, అల్యూమినియంలపై 26% పన్నులు విధించడమే కాకుండా, భారత్‌లో తమ మార్కెట్‌కు (%ఝతీఎవ ×అఒఱ%) అడ్డంకులు లేని ప్రవేశం కోసం డిమాండ్ చేశారు. ప్రపంచంలోని తూర్పున చైనా నుండి పశ్చిమ యూరప్, కెనడా వరకు పలు దేశాలు వెంటనే ప్రతిచర్యలు ప్రకటించాయి.లాటిన్ అమెరికా దేశాలు, ఆఫ్రికా దేశాలు కూడా ఈ ఏకపక్ష ట్రంప్ పన్నుల విధింపునకు వ్యతిరేకంగా గళమెత్తాయి. చైనా కౌంటర్ (ప్రత్యర్థిగా పన్నులుగా విధానానికి) టారిఫ్‌లకు ప్రతిచర్యగా ట్రంప్ చైనాతో రెండు దఫాల చర్చలతర్వాత వాణిజ్య ఒప్పందానికి వెళ్లాల్సి వచ్చింది. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి మాటలు పలికే మోడీ మాత్రం ట్రంప్ ఏకపక్షంగా బెదిరించే పద్ధతిలో పన్నులను విధించటం గురించి ఏమీ మాట్లాడకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో భారతదేశంలో తక్కువ వేతనంతో పని చేసే రంగాలైన టెక్స్టైల్, రత్నాభరణాలు, చర్మవస్తువులు, వస్త్రాలు, ప్లాస్టిక్, రసాయనాలు, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష, అరటిపండ్లపై అదనపు 26% పన్నుల నుండి పూర్తి మినహాయింపు కోసం వేడుకుంటుంటే, అమెరికా మాత్రం అధునాతన సాఫ్ట్‌వేర్‌లు, పరిశ్రమల వస్తువులు, ఆటో లు, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్రో రసాయన ఉత్పత్తులు, వైన్, పాల ఉత్పత్తులు, ఆపిల్స్, ఇంతటితోనే కాకుండా జన్యుపరిణామం చేసిన పంటలపై డ్యూటీ మినహాయింపులు కోరుతోంది. ఈ ఒప్పందం ద్వారా 2025లో 191 బిలియన్ డాలర్లుగా ఉన్న ఇరు దేశాల వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు పెంచాలన్నది లక్ష్యం. ఈ కొత్త ఒప్పందాన్ని 2025 జులై 8న ప్రకటించే అవకాశం ఉంది. స్వతంత్ర పరిశీలకుల ప్రకారం ట్రంప్ భారతదేశాన్ని మరింతగా తెరవాలి 'ఓపెన్ అప్ ఇండియా' అనేది 'స్టార్టప్ ఇండియా' చొరవను సూచిస్తుంది. ఇది స్టార్టప్‌లు, ఆవిష్కరణలకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను పెంపొందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం ప్రధాన కార్యక్రమం. వ్యవస్థాపకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ఉద్యోగ సృష్టికర్తల దేశంగా మార్చడం దీని లక్ష్యం. ఈ చొరవ పన్ను మినహాయింపులు, నిధులకు సులభమైన ప్రాప్యత, మేధో సంపత్తి రక్షణకు మద్దతు వంటి వివిధ ప్రయోజనాలను అందిస్తుంది. కొత్తప్రకటన ఆధారంగా మోడీ పాలన అమెరికా ఉత్పత్తుల కోసం ఎర్రతివాచి పరచడానికి సిద్ధమవుతోంది. 2020 నివేదిక ప్రకారం ప్రపంచ బ్యాంకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఇండెక్స్‌లో భారతదేశం 190 దేశాలలో 63వ స్థానంలో ఉంది. 2014లో 142వ స్థానం నుండి ఇది గణనీయమైన మెరుగుదల. 2021లో ప్రపంచ బ్యాంకు ఈ నివేదికను నిలిపివేసింది. కానీ అప్పటి వరకు భారతదేశం సాధించిన పురోగతి నియంత్రణ సంస్కరణలకు, మరింత వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో దాని నిబద్ధతను హైలైట్ చేసింది. ఫలితంగా భారత ఔషధ పరిశ్రమపై తీవ్ర ప్రభావంపడడం, డిజిటలైజేషన్, కృత్రిమ మేధ (ఎఐ)వంటి సాంకేతిక విధానాలలో భారత్ కష్టపడి సాధించిన పురోగతిని దెబ్బతీసే పరిస్థితులు ఏర్పడుతాయి. సోయాబీన్, మొక్కజొన్న, ఆపిల్స్, పాలు మొదలైన వాటిపై అమెరికా ఒత్తిడి వల్ల వచ్చే కొత్త పన్ను మినహాయింపుల మొదటగా నష్టపోయేది,బలిపశువులు అయ్యేది రైతాంగమే. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై తక్కువ పన్నులు, జిపి – (జెనిటికల్లి మాడిఫైడ్ –జన్యుపరంగా మార్పిడి చేయబడింది– ఉదాహరణకు బిటి విత్తనాలు–) విత్తనాల స్వేచ్ఛా ప్రవేశం, అమెరికా అగ్రిబిజినెస్, బహుళజాతి కంపెనీల (ఎంఎన్‌సిల) స్వేచ్ఛా విస్తరణ భారత వ్యవసాయానికి ఘోర విపత్తుకావడం ఖాయం. ఇది 2020 సెప్టెంబర్‌లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆదేశాల ప్రకారం కొవిడ్ సమయంలో నరేంద్ర మోడీ తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలను గుర్తుకు తెస్తోంది. అదే విధంగా రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అమెరికా –భారత పౌర అణు ఒప్పందాన్ని (సివిల్ న్యూక్లియర్ ఒప్పందాన్ని)కూడా ఈ వాణిజ్య ఒప్పందానికి అనుబంధంగా కలిపారు. దీనిలో భాగంగా అణుశక్తి చట్టాన్ని( అటామిక్ ఎనర్జీ చట్టం) సవరించడం, ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతులు ఇవ్వడం, న్యూక్లియర్ ప్రమాదం జరిగితే కంపెనీల బాధ్యతను తగ్గించేలా సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ (అణు నష్టానికి పౌర బాధ్యత చట్టాన్ని– ) చట్టాన్ని సవరించడం మోడీ ప్రభుత్వం ప్రతిజ్ఞాబద్ధమైంది. 2025 బడ్జెట్‌లో విదేశీ న్యూక్లియర్ సంస్థలకు చిన్న మాడ్యులర్ రియాక్టర్లు నిర్మించడానికి మార్గం ఇచ్చినది. సారాంశంగా చెప్పాలంటే మోడీ పాలనకు ఉన్న అమెరికా సామ్రాజ్యవాద విధేయతే ఈ ట్రంప్ విధానాలకు లొంగిపోవడంలో ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సమయంలో రైతులు, కార్మికులు, అశేష భారత ప్రజల జీవనాధారాలను తృణప్రాయంగా విస్మరించి అమెరికా సామ్రాజ్యవాదానికి బానిసగా మారటం అత్యంత దురదృష్టకరం.

# జాతీయ రహదారిపై యథేచ్ఛగా వ్యర్థాల పారబోత





**శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానానికి కూతవేటు దూరంలో....**

**బోనోత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలి...**

**దుర్వాసనతో నిత్యం భక్తులకు ఇక్కట్లు...**

**వాహనదారుల పాలిట శాపంగా మారిన వ్యర్థాల పారబోత**

**చౌటుప్పల్.జులై 07. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ మండల కేంద్రం,దండు మల్కాపురం గ్రామ పరిధి జాతీయ రహదారి పక్కన కొలువైన భక్తుల ఇలవేల్పు శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానానికి కూతవేటు దూరంలో దేవాలయానికి వెనుక హైదరాబాద్ నుండి విజయవాడకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కన వ్యర్థాల పారబోత వాహనదారుల పాలిట శాపంగా మారాయి.వ్యర్థాలు కుళ్లిపోయిన తర్వాత వచ్చే దుర్వాసనతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు,శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిపై పోసిన వ్యర్థాలనుండి వచ్చే దుర్వాసనకు ఈగలు, దోమలు పెరగడం, కుళ్లిపోయిన పదార్థాల వల్ల వచ్చే దుర్వాసనకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అంతేకాక దేవాలయానికి వచ్చే చాలామంది భక్తులు సేద తీరటానికి రహదారికి పక్కన ఉన్న చెట్ల నీడలో కూర్చొని భోజనాలు చేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. వ్యర్థాల కారణంగా వచ్చిన ఈగలు,దోమలు, దుర్వాసన తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయానికి వెనక చివరి వరకు సత్రాలు ఉండడంతో అక్కడ భక్తులు ఉండాలంటే జంకుతున్నట్లు తెలుస్తుంది. ఈనెల 12 నుంచి 14 వరకు శ్రీశ్రీశ్రీ ఆందోల్ మైసమ్మ 20వ బోనోత్సవాలు ఉన్నందువల్ల దేవాలయానికి సామాన్య భక్తుల నుంచి రాజకీయ ప్రముఖులు, అధికారులు దర్శనానికి వచ్చే అవకాశం ఉంది. తూప్రాన్ పేట గ్రామం నుండి కూడా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి అదే మార్గం గుండా రావాల్సి ఉంటుందని అందువల్ల మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలిగించకుండా తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని వ్యర్థాలను తొలగించేలా చూడాలని ప్రజలు,భక్తులు కోరుతున్నారు.

**వాహనదారుల పాలిట శాపంగా మారిన వ్యర్థాల పారబోత**

హైదరాబాద్ నుండి విజయవాడకు వెళ్లే జాతీయ రహదారిలో శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానానికి వెనుక కొంత దూరంలో రాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు తమ ఇష్టానుసారంగా వ్యర్థాలను పారబోసి వెళ్తున్నారు.అందులో ఎక్కువగా తాటి ముంజలు,ఇతరత్రా వ్యర్థాలను పారబోసి వెళ్తున్నారు.దీనితో తాటి ముంజల వ్యర్థాలు గాలికి జాతీయ రహదారిపైకి వచ్చి వాహనదారుల పాలిట శాపంగా మారాయి.ముఖ్యంగా హైదరాబాదు నుండి విజయవాడ వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన వ్యర్థాలను పారబోసిన ఆ కాస్త దూరం దాటుకుని వెళ్లడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులకు, భక్తులకు ఇబ్బంది కలగకుండా వ్యర్థాలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పేదల ఇంటి కల -ఇందిరమ్మ ఇల్లు





**సంస్థాన్ నారాయణపురం, జూలై 07( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఇంద్రమ్మ ఇల్లు లబ్ధిదారుడు మహేశ్వరం విగ్నేశ్వర్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై మాట్లాడుతూ పేద ఇంటి కలలను నెరవేర్చి సంకల్పంతో ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశాలతో పేదింటి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అంచలంచలుగా అందిస్తూ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజా పాలనలో కొనసాగుతున్నదని ఈ సందర్భంగా అన్నారు . 6 గ్యారెంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ కార్యక్రమం వేగవంతంగా జరుగుతున్నదని పేదలు బడుగు బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని,రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం పంపిణీ కొత్త రేషన్ కార్డులు మహాలక్ష్మి పథకము గృహ జ్యోతి లాంటి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దేనిని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎండి నయుం షరీఫ్, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, కార్యదర్శి కొండ నవీన్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్లు ఉప్పరగొని యాదయ్య, మహేశ్వరం విగ్నేశ్వర్, బొమ్మరబోయిన రవికుమార్, గునిగంటి రాజు గౌడ్, అంతటి స్వామి గౌడ్,ఎర్రోళ్ల ముత్తయ్య జక్కా నాగభూషణం, ఉప్పల రాజయ్య, రాసమల్ల గాలయ్య, బద్దుల యాదగిరి, వేము గాలయ్య, మందు గుల గంగయ్య, అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు బల్లెం రామస్వామి, కట్టా వెంకటేశం, మహేశ్వరం వసంత, బల్లెం సుశీల, మహేశ్వరం హేమలత, గుండమల్ల పెంటమ్మ, గుండమల్ల అంజయ్య పాల్గొన్నారు.

# ఈ నెల 9న మోడి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాపిత సమ్మె , గ్రామీణ నిరసనలను జయప్రదం చేయండి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మ**



**భువనగిరి, జూలై 07( ప్రభాత సూర్య):** కేంద్రంలోని మోడీ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మికుల, పేదల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె, గ్రామీణ నిరసనలను అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య భవన్, భువనగిరిలో ప్రజా సంఘాల సంయుక్త సమావేశం రైతు సంఘం జిల్లా నాయకులు ఏదునూరి మల్లేశం అధ్యక్షతన జరగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దుచేసి, కనీస వేతనం నెలకు 26 వేలుగా నిర్ణయించాలని, ఎం.ఎస్.పి హామీలను అమలు చేసి రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, ఉచిత వ్యవసాయ రుణాలు ఇచ్చి వ్యవసాయ పరికరాలకు రాయితీలు కల్పించి ఇవ్వాలని, ఉపాధి హామీని బలోపేతం చేసి రూ.2.5 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేసినారు. సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని కోరారు. జన భద్రత కోసం ఆహార భద్రత కల్పించాలని, ప్రతి ఒక్కరికి 10 కిలోల బియ్యం తోపాటు 14 రకాల నాణ్యమైన నిత్యావసర సరుకులు అందించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇండ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలిచ్చి ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, భూమిలేని పేదలకు రెండు ఎకరాల ప్రభుత్వం ఇచ్చి సేద్యం చేసుకుంటున్నా రైతులకు పట్టాదారు పా పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ప్రైవేటీకరణ విరమించుకోవాలని, దళిత, గిరిజన, ఆదివాసి, మహిళల హక్కులను కాపాడి రక్షణ కల్పించాలని, మనువాదాన్ని తిరస్కరించి భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం తీసుకురావాలి అన్నారు. భూ లేని రైతులకు గుర్తించి వారికి సామాజిక భద్రత, బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ప్రతి పౌరుడికి నెలనెలా నిరుద్యోగ భృతి రూ.10 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, పెరుగుతున్న ధరలను అరికట్టాలనే డిమాండ్స్ తో ఈనెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ నిరసనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిరసనలు చేపట్టి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రదర్శన, ర్యాలీలో, ఆందోళనలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిలువేరు ఎల్లయ్య, కొండపురం యాదగిరి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండ అశోక్, ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి, రైతు సంఘం మండల కార్యదర్శి జిట్టా అంజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మచ్చ భాస్కర్, రజక వృత్తి దారులు సంఘం మండల నాయకులు ఐతరాజు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్ .జూలై07. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండల పరిధిలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలతో పాటు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ పాల్గొని నూతనంగా నిర్మించినటువంటి ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం కేక్ కట్ చేసి పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం అంటే మాదిగలకు ఓక పండుగ రోజు అని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా నేనున్నానంటూ అలుపెరగని పోరాటం చేసే పోరాటయోధుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బోయ రామచందర్,బోయ దేవేందర్,మాజీ సర్పంచ్ లు అల్మాస్ పేట కిష్టయ్య, ఊదరి నరసింహ,మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర నాయకులు ఊదరి వెంకటేష్ మహాజన్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు అర్జున్,సామాజిక ఉద్యమకారుడు కట్టెలు లింగస్వామి,ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాము,మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఊదరి శ్యాం సుందర్,మాదిగ జర్నలిస్ట్ ఫోరం మండల అధ్యక్షులు ఆరుట్ల లింగస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర గౌతం, ఎమ్మార్పీఎస్ మున్సిపల్ అధ్యక్షులు ఎర్ర శంకర్, బోయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా



**చౌటుప్పల్.జులై 07. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా,చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామ మాజీ వార్డ్ మెంబర్ గట్టు మొగలయ్య తన బిజెపి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం పత్రికకు ఇచ్చిన ప్రకటన ద్వారా తెలియజేశారు.భారతీయ జనతా పార్టీలో తనికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.

## అమ్మానాన్న అనాధాశ్రమంలోని వృద్ధులకు ఉచిత వైద్య సేవలు




**చౌటుప్పల్.జులై 07.ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పురపాలక కేంద్రం లోని అమ్మ నాన్న అనాధాశ్రమంలో సోమవారం శ్రీ రామానుజ చారిటబుల్ ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షా శిబిరం నిర్వహించారు. ఆశ్రమంలో ఉంటున్న వారిలో 300 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అందులో రక్తహీనత ఉన్నవారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లను ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు గట్టు శంకర్ భారత్ వికాస్ పరిషత్ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధనుంజయ్,చీకూరి వెంకటేశం,సంస్కార్ కన్వీనర్ యువరాజు, జనహిత క్యాంపు కోఆర్డినేటర్ బి. నర్సింగ్ రావు, వాలంటీర్లు కల్పనా దత్త, రాజేశ్వరి,స్నేహ, రోహన్ పాల్గొన్నారు.

## నాలాపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని వినతిపత్రం అందజేత



**చౌటుప్పల్.జులై7.ప్రభాత సూర్య:** భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో చౌటుప్పల పుర పరిధిలో వలిగొండకు వెళ్లే రోడ్డులో సర్వేనెంబర్ 176 లో బఫర్ జోన్ సంబంధించి నాలా స్థలం ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టినారని నాలాపై అక్రమ నిర్మాణాలు తొలగించి నాలా స్థలానికి రక్షణ కల్పించాలని కోరుతూ బిజెపి పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారికి వినతి పత్రంను అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... ఇట్టి నిర్మాణనికి ఎన్.ఓ.సి కి సంబంధించిన పవర్ ఎవరు ఇచ్చారని,పర్మిషన్ ఏ విధంగా వచ్చినదని అన్నారు.గతంలో ఈ స్థలంలో అక్రమ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ తొలగించినారని గుర్తు చేశారు. నేడు నాటి కలెక్టర్, పురపాలక పాలకవర్గం లేని సమయంలో రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వీటిపై తగు విచారణ జరిపి అక్రమ నిర్మాణాలను తొలగించి ఈ స్థలంకు,నాలాకు రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఈ.ఈ కి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, దూడల భిక్షం గౌడ్,కంచర్ల గోవర్ధన్ రెడ్డి,కాసుల వెంకటేశం, ముత్యాల భూపాల్ రెడ్డి, వనం ధనంజయ, ఉష్కాగుల నాగరాజు, వంగాల రమాకాంత్, వరగంటి భాను ప్రకాష్, చెన్నగోని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీలో ప్రపంచ చాక్లెట్ దినోత్సవ వేడుకలు



**చౌటుప్పల్,జులై 07 ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పుర పాలక కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో సోమవారం ప్రపంచ చాక్లెట్ దినోత్సవం సందర్భంగా చాక్లెట్ రంగు దినోత్సవాన్ని ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కేవి బి కృష్ణరావు, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.చాక్లెట్ రంగులో ఉన్న చామగడ్డ బ్రౌన్ రైస్ బెల్లం కందులు, రాగులు, ఖర్జూర పండ్లు,తేనె, బ్రౌన్ బ్రెడ్ ప్లమ్,కేకులతో పాటు వివిధ రకాల చాక్లెట్లు,చాక్లెట్ డ్రింక్స్,చాకోలెట్ చాకోస్,చాక్లెట్ కాఫీ,చాక్లెట్ ఐస్ క్రీమ్లను ప్రదర్శించి వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రినిటీ విద్యాసంస్థల ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జని మంజుల మాట్లాడుతూ...చాక్లెట్ కోకో గింజల నుండి తయారవుతుందని వీటిలో ఉండే ఆంటీ ఆక్సైడ్ శరీరానికి మేలని ఇవి తినడం వలన శరీరం, బుద్ధి ఏకాగ్రతతో ఉంటుందని తెలిపారు. చాక్లెట్లు, ఐస్ క్రీమ్ వంటివి తిని నోటిని నీటితో శుభ్రంగా కడగనియెడల దంతాలపై దుష్ప్రభావం ఉంటుందని విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని మహబూబ్నగర్ బస్సులు



**మద్దూర్ జులై 7** సమయపాలన పాటించని మహబూబ్నగర్ బస్ డిపో బస్సులు ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్దూర్ టు మహబూబ్నగర్ బస్సులు నడుస్తున్నాయి కానీ ఉదయం సమయంలో కొంతమంది ప్రైవేటు ఉద్యోగులు గవర్నమెంట్ ఉద్యోగులు మద్దూర్ నుంచి మహబూబ్నగర్ కు ఉద్యోగం కోసం వెళ్లి వస్తుంటారు. సమయపాలన పాటించకపోవడంతో ఆ ఉద్యోగులు ఆఫీసులకు సమయానికి వెళ్లకపోవడంతో ఆఫీసుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉదయం సమయంలో రవి నాయక్ అనే ఒక ఉద్యోగస్తుడు వారి ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమయపాలన పాటించేటట్లు చూడాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

## యోగ గురువులకు ఆత్మీయ సన్మానం


**-సర్వేజన సుఖినోభవంతు ఫౌండేషన్ 4వ వార్షికోత్సవాలు**




**చౌటుప్పల్.జులై 07. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఎస్ లింగోటం గ్రామంలో సర్వే జన సుఖినోభవంతు ఫౌండేషన్ నాల్గవ వార్షికోత్సవాలను,సోమ జనార్దన్ రెడ్డి 86వ జన్మదిన కార్యక్రమంలో బాగాంగా ఫౌండేషన్ చైర్మన్ సోమ శ్రీనివాస్ రెడ్డి రాధికా రెడ్డి ల ఆధ్వర్యంలో యోగ గురువులందరినీ ఆహ్వానించి ఎస్ లింగోటం గ్రామంలోని యోగ,ధ్యాన మందిరంలో ఆత్మీయ సన్మానంను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యోగ గురూజీలు యోగా గొప్పతనాన్ని వివరించారు.ప్రతి ఒక్కరూ యోగను అభ్యసించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు.ఈసన్మాన కార్యక్రమంలో యోగా గురువు పతాంజలి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు గురూజీ,ఆదియోగి పరమేశ్వర,యోగ ఫౌండేషన్ తుల్జపూరి వినోద్ కుమార్ గురూజీ, కర్ణాకర్ గురూజీ, సత్యం గురూజీ,రుక్మిణి మాతాజీ, దీక్షిత్ స్వామి గురూజీ, శ్రీనివాస్ గురూజీ,రమేష్ బాబు గురూజీ,పాండు గురూజీ,రామ్ రెడ్డి గురూజీ,గోపాల్ గురూజీ, సంధ్య గురూజీ,పాపయ్య గౌడ్ గురూజీ,హరీష్ గురూజీ,సాత్విక్ గురూజీ,మల్లేష్ గురూజీ, రామ్ రెడ్డి గురూజీ, మురళి గురూజీ,సైదులు గురూజీ,యోగ సాధకులు చెనగోని అంజయ్య గౌడ్ విజయలక్ష్మి,వసంత జిల్లా బిక్షపతి,గంజి గణేష్, రాచకొండ నరసింహ,లోడే బిక్షం,శారద,కృష్ణవేణి, వర్మ ,తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మద్దూర్ లో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు


**మద్దూర్, జులై 7** మద్దూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో ఎరుకల సంఘం వారి ఆధ్వర్యంలో ఆరాధ్య గురుదైవం ఏకలవ్య జయంతి వేడుకలు నిర్వహించారు




మద్దూర్ మండలం లోని ఆదివాసి ఎరుకల ఏకలవ్య వారసులు ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి సంఘం మండల అధ్యక్షులు రాగరి కిష్టప్ప ప్రధాన కార్యదర్శి బాలప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏకలవ్య జయంతిని ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించాలని ఏకలవ్యుడు ఆదివాసి ఎరుకల జాతికి ఆదర్శంగా ఉంటూ గొప్ప గురుభక్తి, త్యాగము,పట్టుదల కలిగినవారని ఆయన జాతి కోసం చేసిన సేవలను భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. ఎరుకల సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరించాలని సంఘ పట్టణ నాయకులు రామకృష్ణ రవికుమార్ అన్నారు ఇట్టి కార్యక్రమంలో సంఘ నాయకులు దోరేపల్లి కృష్ణ, కొత్తపల్లి రాములు మహేష్, తదితరులు పాల్గొన్నారు

## యాదగిరిగుట్ట ధర్మకర్త మండలి చైర్మన్ నరసింహమూర్తికి ఘన సన్మానం

**నరసింహమూర్తి షష్టిపూర్తి కార్యక్రమంలో పాల్గొన్న బద్దం ధనుంజయ్ గౌడ్ ౹ మిత్ర బృందం**



**యాదగిరిగుట్ట, జూలై 07(ప్రభాత సూర్య):** యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో యాదగిరిగుట్ట దేవాలయ ధర్మకర్త మండలి చైర్మన్ నరసింహమూర్తి షష్టిపూర్తి కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సన్మానించిన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్, మాజీ సిటీ లైబ్రరీ చైర్మన్ సామ కృష్ణారెడ్డి, కరాటే డైరెక్టర్ ఆర్ కె సుభాష్, ప్రముఖ శివాని హొటల్స్ గ్రూప్ అధినేత శివాని శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ మాట్లాడుతూ నరసింహమూర్తి ప్రజల క్షేమం కోసం, రాష్ట్ర, దేశ ప్రజల ఆరోగ్యం, శాంతి, ప్రజలకు అష్ట ఐశ్వర్యాలు కలగాలని,ఎన్నో పూజలు, యజ్ఞలు, హొమాలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కోరుకున్నారని అన్నారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి షష్టిపూర్తి శుభాకాంక్షలు తెలిపారు.

# అవనిపై అమ్మ ప్రేమను మించింది లేదు





**-అమ్మల్లాంటి మహిళల కోసం నేను అండగా ఉంటా..**
**-మహిళలు కుటుంబం కోసం తమ జీవితాన్ని త్యాగం చేస్తారు..**
**-మహిళలు అన్ని రంగాలలో రాణించాలి...**
**-మహిళలకు ఉచితకుట్టు శిక్షణ ధ్రువపత్రాల పంపిణీ**
**-ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్.జులై 07. ప్రభాత సూర్య :** అవనిపై తల్లి ప్రేమను మించింది లేదని, అమ్మలాంటి మహిళలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో లక్కారం ఎస్ఎంఆర్ కన్వెన్షన్ హాల్లో మునుగోడు నియోజకవర్గం, చౌటుప్పల్ మండల, మున్సిపాలిటీ పరిధిలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన 2000 మంది మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని ఫౌండర్ వ్యవస్థాపకురాలు బొజ్జ సంధ్యారెడ్డి,స్థానిక నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పొందిన మహిళలకు తన చేతులు మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... మహిళల కమిట్మెంట్ చాలా గొప్పదని వారు కుటుంబం కోసం తమ జీవితాన్ని త్యాగం చేస్తారని కొనియాడారు.ఈ రోజుల్లో మహిళలు రాణించని రంగమే లేదని గుర్తుచేశారు.మహిళలను హింసించే వారు ఇప్పటికైనా మారాలన్నారు.మహిళలు ధైర్యంగా అన్ని రంగాలలో రాణిస్తూ ముందడుగు వేయాలన్నారు. మహిళా ఫౌండేషన్ ప్రారంభించడం ఆనందంగా ఉందని,ఈ సొసైటీ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలను ఆయన అభినందించారు.చౌటుప్పల్ మున్సిపాలిటీలో 67% మంది మహిళలు శిక్షణ పొందేలా తోడ్పాటును అందించిన బొజ్జ సంధ్యారెడ్డి సేవలు అభినందనీయమని వారు చేసిన కృషిని మర్చిపోకూడదన్నారు. ఇలాంటి వారికీ తన సహకారం,ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు.ఈనెల 6వ తేదీ ఆదివారం మునుగోడు క్యాంప్ ఆఫీసులో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేసిన కార్యక్రమంలో 80% మంది బాలికలే ఉన్నారని గుర్తుచేశారు.ఇంటికి మహాలక్ష్మి లాంటి స్త్రీ కష్టాల్లో కుంగిపోవొద్దని,కుటుంబ పరిస్థితి ఎంత దీనంగా మారిన నాలాంటి వారిని ఆశ్రయిస్తే తప్పకుండా ఆర్థిక సహకారం అందచేస్తానన్నారు. ఎంతోమంది మంది మహిళలకు తాను ధైర్యం చెప్పి తనకు చేతనైనా సహకారం అందించానన్నారు.తాను మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలనను సాధ్యం చేశానని, మహిళలు ఇప్పుడు సంతోషంగా ఉన్నారని అన్నారు.

మా అమ్మ పేరు మీద నెలకొల్పిన కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా 15 కోట్లతో వృద్ధాశ్రమం స్థాపించానని, కరోనా సమయంలో కోట్లాది రూపాయలతో నిత్యావసర సరుకులు అందించానని తెలిపారు. 25 లక్షలతో విద్యలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి నగదు బహుమతి ఇచ్చానని, వలిగొండ రోడ్ లో ఒక ఎకరం స్థలాన్ని ప్రభుత్వం తరపున కేటాయించి స్కిల్ డోవలప్మెంట్ కోసం అవసరమైతే 5 కోట్ల వరకు ఖర్చు చేసి భవనం కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గం ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, మోగుదాల రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు..

**ప్రత్యేక ఆకర్షణగా పెద్దగూడెం బురన్ బాబా సవారి ...**
**దర్గాను దర్శించుకునేందుకు ఉమ్మడి రాష్ట్రాల భక్తులు....**



**వనపర్తి ప్రభాత సూర్య ప్రతినిధి** వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామం లో పీర్ల మసీదుకు భక్తజనం పోటెత్తింది. ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు వెల సంఖ్యలో హాజరయ్యారు.

వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామంలో పీర్ల మసీదుకు భక్తజనం పోటెత్తింది. మొహరం వేడుకల్లో భాగంగా బూరన్ బాబా దర్గా సవారి ఊరేగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులు మేళ తాళాలతో పెద్ద పీర్ల మసీద్ దగ్గర, బురాన్ బాబా పీర్ల దర్గాను దర్శించుకుని దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులు గొర్రెలు, మేకలతో కందూర్లు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మరి కొందరు బెల్లం, పుట్నాలు, గోధుమలతో తయారుచేసిన మలీజా నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోనే అత్యంత వైభవంగా జరిగే పెద్దగూడెం మొహరం ఉత్సవాల్లో భాగంగా చిరు వ్యాపారులు గాజులు, మిఠాయి, ఆట వస్తువుల దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు వనపర్తి రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు...

## విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



**చౌటుప్పల్.జులై7.ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మండల కేంద్రం, పంతంగి గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న వందమంది విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేసి సాగ జంగారెడ్డి గీత దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సోమవారం సాగ జంగారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేయడం జరిగినదన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బల్ల బాలరాజు,మండల విద్యాధికారి గురువారావు లు మాట్లాడుతూ..సాగ జంగారెడ్డి గీత సేవలు అభినందనీయమన్నారు. సాగ జంగారెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేయడం సంతోషదాయకమన్నారు. వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంతంగి మాజీ సర్పంచ్ అంతటి రమేష్ గౌడ్, పంతంగి కార్యదర్శి చింతల శ్రీకాంత్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కడగంచి చలమందరాజు, మాజీ వార్డు సభ్యులు కాకి సుందరయ్య, పబ్బు లింగస్వామి, కాకి జ్యోతి,బోయ శీను, చింతకింది నరసింహ, బోయ కిష్టయ్య, దిండు శ్రీకాంత్, చింతకింది సతీష్, బోయ యాదగిరి లు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే వచ్చిన ఫిర్యాదుల పరిశీలించిన -జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్.

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులకు ఆదేశం**

**నల్లగొండ(ప్రభాత సూర్య):-** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 68 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి, వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పి అన్నారు. ఎస్పీ ఆఫీస్ కి, పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదు దారులు మధ్యవర్తులని తీసుకురావద్దని, బాధితులు మాత్రమే వచ్చి ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలని ఎస్పి తెలిపారు.



# త్రిశంఖు స్వర్గంలో తెలంగాణ ఉద్యమకారులు

**-తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య**



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** ఒకటే భాష ఒకటే సంస్కృతి ఒకటే సాంప్రదాయం ఒకటే జీవన సరళి ఉన్నప్పటికీ ఒకే భౌగోళిక ప్రదేశంలో నివసిస్తున్నప్పటికీ తమదైన ప్రాంతీయ అస్తిత్వాన్ని వదలు కొనని సమూహం చేసే ఘర్షణ పడే సంఘర్షణ ఉద్యమాలకు దారితీస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాకిస్తాన్ ఇందుకు మంచి ఉదాహరణలు. వారిది తెలుగే మాతృభాష అయినప్పటికీ తెలంగాణ ఉద్యమం తలెత్తింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు దారి తీసింది. వారు ముస్లింలే అయినప్పటికీ పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ అవతరించింది. ఇరాన్ ఇరాక్ రెండు ముస్లిం దేశాలే అయినప్పటికీ దశాబ్దాల పాటు ఇద్దరి మధ్య యుద్ధం కొనసాగింది. ప్రాంతీయ అస్తిత్వాన్ని కి గల బలం బలగం ఇదే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ చరిత్రను పరిశీలించాలి. నిజాం కాలంలోనే తెలంగాణ ప్రాంతం ఒక దేశంగా ఉన్నప్పుడు తలెత్తిన ముల్కీ నాన్ ముల్కీ ఉద్యమం క్రమేణ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దారి తీయగా తొలి మలి దశల మహత్తరమైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సాగింది. ఒకచోట నుండి మరో చోట సుమారు 50 కిలోమీటర్ల దూరంలోనే భాష యాస మాండలికం మారుతుంటాయి. ఆ విధంగా ఆంధ్ర తెలంగాణలో కూడా మనం దీనిని గమనించి పరిగణలో తీసుకుంటే తెలంగాణ ఉద్యమం ఆవిర్భవించడం వెనుక విశేషాలు అంశాలు మనకు అవగతమవుతాయి. మన ఆకాంక్షలు మన కోరికలు మన ఆశలు మన ఆశయాలు మన డిమాండ్లు ఏమిటన్నది తెలిసిందే. కాగా 1969 వ సంవత్సరం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రారంభమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఆ నాడే ఆమరణ నిరాహార దీక్ష కూడా చేపట్టడం జరిగింది. దశాబ్దాలపాటు కొనసాగిన తెలంగాణ ప్రజల ఉద్యమాలు-పోరాటాలు పదకొండు సంవత్సరాల క్రితం ఫలించాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ ప్రజల ఉద్యమకారుల ఆకాంక్షలు మాత్రం నెరవేరలేదు. నిజాం రాజ్యం పాలన సాగుతున్న సమయంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం జరిగింది. అదేవిధంగా మన నిధులు మన విధులు మన నీళు చందంగా మన ఉపాధి అవకాశాలు కూడా ఇందులో ఇమిడి ఉన్నాయి. ఒక విధంగా భౌతిక తెలంగాణ కాకుండా సామాజిక తెలంగాణ కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన మన కల అది ఇంకా సాకారం చెందలేదు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే తెలంగాణ ద్రోహులకు దాని ఫలాలు అందాయి. ఎన్నో త్యాగాలు బలిదానాలు చేసిన ఉద్యమకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారి 'త్రిశంఖు స్వర్గం లో చిక్కుకు పోయారు. ఇలాంటి స్థితిలో తెలంగాణ ప్రజలు తెలంగాణ ఉద్యమకారులు గత పది సంవత్సరాలు పరిపాలించిన ఉద్యమ పార్టీ మోసం చేసిన కారణంగా తెలంగాణ ఏర్పాటు డిమాండ్ కు సానుకూలంగా స్పందించి తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిన జాతీయపార్టీ కాంగ్రెస్ కు గత ఎన్నికలలో సకల జనులు మద్దతు పలికారు. ఆ కారణంగా గద్దెనెక్కి ప్రస్తుతం పాలిస్తున్న కాంగ్రెస్ కూడా గత పాలకుల వలె తెలంగాణ ప్రజలతో ఉద్యమకారులతో ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తోంది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు మరో పోరాటానికి సన్నద్ధం కావాల్సిన సమయం ఆలస్యమైనప్పటికీ ఆసన్నమైంది. పోరాటమే తెలంగాణ ప్రజల ఊపిరి తమ అస్తిత్వం కోసం దశాబ్దాల పాటు పోరాడిన చరిత్ర మనది. పాలకులు ప్రజల పట్ల ఉద్యమకారులపట్ల అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా విజ్ఞప్తులు వినతులు సమర్పించడం ద్వారా చిన్న చిన్న ప్రయత్నాలతో ఊబిలో దున్న వంటి ప్రభుత్వాలను కదిలించడం కష్టం. దీనికి సరైన మార్గం భావసారూప్య పార్టీలు సంఘాలను కలుపుకుని ప్రణాళికబద్ధ వ్యూహంతో సంఘటిత మిలిటెంట్ పోరాటాలకు ఉద్యమాలకు దిగాలి. అప్పుడే ప్రభుత్వంలో కదలిక వస్తుంది. పాలకులు మన దగ్గరికి వస్తారు అంటూ

తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ భావిస్తోంది. త్వరలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్ట్ లో పొందుపర్చి ఇచ్చిన వాగ్దానాలను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ త్వరలో తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ ఒక కార్యాచరణ పథకాన్ని అమలు చేయనుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఏ విధంగా ప్రజలు ఉద్యమకారుల వెన్నంటి వచ్చి తమ మద్దతు తమ సంఘీభావాన్ని ప్రకటించారో అదే విధంగా తెలంగాణలో జరగబోయే మరో పోరాటానికి మరో ఉద్యమానికి అందజేయాలని కోరుకుంటోంది తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ.

**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం**

భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణలో సాగిన మహత్తర చారిత్రక రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణ ప్రజల వీరోచితాన్ని ప్రపంచం ఎదుట ఆవిష్కరించింది. దీనికన్నా ముందు నిజాం రాజ్యంలో జరిగిన ముల్కి- నాన్ ముల్కి (స్థానిక- సానికేతరులు) నిరసనలు సామన్య భాహుళ్యంలో సంచలనం కలిగించకపోచకపోయినా కొద్దగా ఆలోచనను రేకెత్తించింది. ఇలాంటిని చదివి గ్రహించిన నాటి ఫజులుల్లా కమీషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించింది. ఆంధ్రాలో తెలంగాణ ప్రాంతాన్ని కలపడం మంచిది కాదని కూడా హితవు పలికింది. సరే - ఇదిలా ఉండగా వందల నుంచి వేలాది మంది మరణానికి కారణమై ఆ తరువాత విముక్తి విమోచన విద్రోహం అనే అంశాలకు మాత్రమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పరిమితమైంది. చైనాలో సాగిన లాంగ్ మార్చ్ రష్యాలో జరిగిన భోషేవిక్ విప్లవ పోరాటానికి తీసిపోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం - మన పాలకుల వర్గ మత అభిప్రాయాలకు అనుగుణంగా ఈ పోరాటం కేవలం రజాకర్- నిజాంకు వ్యతిరేకంగా సాగిన యుద్ధంగా అభివర్ణించబడింది. కొదరు దీనిని మరింత ముందుకు తీసుకునిపోయి హిందూ ముస్లింల మధ్య జరిగన పోరాటంగా చిత్రికరించారు. ఇప్పటికీ ఈ విషయాన్నే ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ మధ్య ఇదే అంశాన్ని తీసుకుని ఒక సినీమా కూడా రూపొందించడం దానికి మన రాష్ట్ర ప్రభుత్వం అవార్డు కూడా ఇవ్వడం జరిగింది. ఈ సినిమాలో చరిత్రను ఏ విధంగా వక్రీకరించారో చాలా మంది తమ అభిప్రాయాలను ప్రకటించడం జరిగింది. కాగా ఈ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మరణించిన వారికన్నా అధిక సంఖ్యలో నిజాం రాజ్యంను భారత దేశంలో కలిపిన అనంతరం జరిగిన పరిణామాల్లో ఎంతో మంది మరణించారు. ఇందులో 90 శాతం ముస్లింలే ఉండడం గమనార్హం. ఆ నాటి బందగి షోయబుల్లా ఖాన్ మరణాలు చూసి కూడా కులమతాలు రాజకీయాలకు అతీతంగా సాగిన రైతాంగ సాయుధ పోరాటం తెలంగాణ ప్రజలు తమ అస్తిత్వం కోసం మహత్తర వీరోచిత చారిత్రాత్మక పోరాటం అనే విషయాన్ని నేడు చాలా మంది విస్మరిస్తున్నారు. తొలి తెలంగాణ ఉద్యమం

తదనంతరం 1969లో జరిగిన తొలి తెలంగాణ ఉద్యమం తెలంగాణ ప్రజల ఆకాంక్షలు హక్కుల గురించి నాటి ఉమ్మడి రాష్ట్రంలో సకల జనులను పాలకులను కదిలించింది. ఈ తొలి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం సైతం తెలంగాణ ప్రజల అస్తిత్వానికి మరో నిదర్శనం. ఈ పోరాటం కేవలం భౌతిక తెంగాణ మాత్రమే కాకుండా సామాజిక తెలంగాణ ఆకాంక్ష కూడా ఇమిడి ఉంది. అలాగే -మన నీళ్లు మన నిధులు మన నియామకాలు అంశాలు కూడా ఈ ఉద్యమంతో జతకూడాయి. దశాబద్దాల పాటు జరిగిన ఈ ఉద్యమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా తొలి వేదికగా నిలిచింది. 1969వ సంవత్సరంలో ఖమ్మం నుంచి ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభమైన తొలి తెలంగాణ ఉద్యమంలో వందలాది మంది మృతి చెదారు. ఎంతో మంది తమ చదువులను తమ భవిష్యత్తును త్యాగం చేసి ఉద్యమంలో భాగస్వాములయ్యారు. మరెందరో తెలంగాణ రాష్ట్ర సాధనకు అమరవీరులై కీర్తి ప్రతిష్టలను ఆర్జించారు. తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కేంద్ర ప్రభుత్వంలో చర్చించడానికి ఆస్కారం కల్పించారు. ఆ నాడు కొందరు విద్రోహుల వల్ల తెలంగాణ ఉద్యమం కొద్దిగా విశ్రమించింది.

**మలిదశ తెలంగాణ ఉద్యమం**

గత 11 సంవత్సరాల కిందట మలిదశ తెలంగాణ ఉద్యమం పాలకులలో కదిలికను తేవడమే కాకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన చేయడానికి వత్తిడి కలిగించింది. ఒకటి రెండు పార్టీలు మినహాఇస్తే అన్నీ పార్టీలు అనేక కుల, ప్రజా సంఘాలు మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాయి. ఈ ఉద్యమంలో సకల జనులు ఉద్యోగస్తులు పాల్గొనడంతో ఉద్యమం తీవ్రతరమైంది. అనేకమంది బుద్ధిజీవులు ప్రజాస్వామికవాదులు వామపక్షవాదులు ఇతర వర్గాల వారు తెలంగాణ ఉద్యమానికి మద్దతు మాత్రమే కాకుండా సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. మలిదశ ఉద్యమంలో కూడా అనేకమంది మరోసారి త్యాగాలు బలిదానాలు చేశారు. రకరాల ఉద్యమాలు పోరాటాల రూపంలో తెలంగాణ ప్రజల అస్తత్వం ఎలాంటిదో మరోసారి చాటి చెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కులమతాలకు రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు ఏదో ఒక రూపంలో ఉద్యమించారు. దశాబ్దాల నాటి తెలంగాణ ప్రజల కల సాకారం చెందింది. కానీ ఆ కల సంపూర్ణం కాలేదు. సామాజిక తెలంగాణ కోసం త్యాగాలు బలిదానాలు చేసిన ఉద్యమకారులకు వారి కుటుంబాలకు తెలంగాణ ఫలాలు అందలేదు. ద్రోహులకు మాత్రం అందాయి. ప్రస్తుతం ఆ ఫలాల కోసం జరుగుతున్న పోరాటంలో ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేని వారు ముందుకు వచ్చి ఉద్యమకారుల సంఘాలను తమ నాయకత్వంలో తీసుకుని ముందుకు పోదామని చూస్తున్న దుస్థితి నెలకొంది. ఈ సమయంలో ఉద్యమకారులు జాగ్రత్తలు వహించాలి.


## ఆలూరు సాంబశివారెడ్డికి అభినందనలు వెల్లువ

-అధినేత ఆదేశాలతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం

-పార్టీ బలోపేతానికి పని చేద్దాం

-జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందాం

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి - ఎన్నారై వింగ్ గ్లోబల్ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి




**అనంతపూర్, జూలై 07( ప్రభాత సూర్య):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ఆలూరు సాంబశివారెడ్డిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇప్పటికే ఆయన ఎన్నారై గ్లోబల్ వింగ్ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు నూతనంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా అనంతపురంలోని ఆయన నివాసంలో వైఎస్సార్సీపీ శ్రేణులు, అభిమానులు ఆలూరు సాంబశివారెడ్డికి పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాతో సత్కరించి, హర్షాతిరేకాలతో అభినందనలు తెలిపారు. పార్టీ అధిష్టానం తాత్కాలికంగా పార్టీ అనుబంధ విభాగాల వ్యవహారాలను పర్యవేక్షించాలని సూచించింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను నియమించిన ప్రియతమ నాయకుడు, పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి ఆలూరు సాంబశివారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకొని, పార్టీ అనుబంధ విభాగాల బలోపేతానికి, సంస్థాగత నిర్మాణాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నేతల సహకారంతో తన సంపూర్ణ శక్తిని అంకితం చేస్తానని తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలన్న లక్ష్యంతో, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తతో ఐక్యతగా ముందుకు సాగుతానని, నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ బాధ్యతలో తన ప్రయాణంలో నిరంతరం ప్రోత్సహిస్తున్న పార్టీ నాయకత్వానికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బెంగుళూరులో డా. పీటర్ నాయక్ కి ఘన సన్మానం



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఒక మీటింగ్లో వాక్య సందేశం అందించడానికి వెళు ృతున్నారని తెలుసుకున్న హెూప్ ఇన్ ఇన్ క్రైస్ట్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్. డా. పీటర్ నాయక్ లకావత్ ను బెంగుళూరులో స్థానికంగా సేవచేస్తున్న ఐజి.ఎఫ్ వ్యవస్థాపకులు దైవ సేవకులు రెవ పి నాగరాజు దైవసేవకులు మృత్యుంజయ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆధ్యాత్మికంగా పలు విషయాలపై వారు చర్చించారని తెలిసి ప్రభువును ఘనపరుస్తున్నాను. అంతే కాక బెంగుళూరు పట్టణంలో అద్భుతమైన పరిచర్య చేస్తున్న దైవసేవకులు రెవ. పి. నాగరాజు పాస్టర్. బి. ఓ. బాబు ని పీటర్ నాయకుడు అభినందించారు.

## ఓటర్ జాబితా సవరణపై ఆర్డీవో శిక్షణ తరగతులు.



**మర్రిగూడ(ప్రభాత సూర్య):** మండలంలోని ఎలక్షన్ బూత్ లెవెల్ అధికారులకు, ఓటరు జాబితా సవరణపై, సోమవారం మర్రిగూడ రైతు వేదిక నందు చండూరు ఆర్డీవో శ్రీదేవి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎలక్షన్ లో బిఎల్ఓల బాధ్యత, చెయ్యాల్సిన పనులను ఆమె విడమర్చి చెప్పారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ చంద్ర శేఖర్, ఆర్ఐ జమీర్, మాస్టర్ ట్రైనర్లు వెంకటేశ్వర్లు, బాలరాజు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పీర్ల పండుగ సంబురాలు

**కుల మతాలకు అతీతంగా గ్రామాల్లో పీర్ల పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది**



**రామడుగు, జూలై 07( ప్రభాత సూర్య):** రామడుగు మండలం కేంద్రంలో సోమవారం రోజున గుండి పీరి రామడుగు ఆలేబలై తీసుకొని పీర్ల పండుగ కొత్త శోభను తెచ్చిపెట్టింది. హిందువులు. ముస్లిం సోదరులు, కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పీర్ల పండుగ వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మొహర్రం సందర్భంగా గ్రామాల్లో పీర్ల ఊరేగింపు డప్పు చప్పుళ్ల మధ్య వీధి వీధిన తిరుగుతూ పీర్లను ఊరేస్తారు. సాయంత్రం మసీదు వద్ద ఆల్వా ఆటలు ఆడుతూ 'అసైదుల హారతి' పాటలు పాడుతూ పీర్ల పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామములకు సంబంధించిన భక్తులు పాల్గొన్నారు

## లోయర్ మానేరు డ్యాం పరిసరాల్లో కార్యక్రమంలో మొక్కలు నాటిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి

**కరీంనగర్ :** వన మహోత్సవంలో భాగంగా వాకింగ్ ట్రాక్ వద్ద 2 వేలకు పైగా మొక్కలు మహిళలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి , ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి,కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గోన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో మొక్కలు నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మన ప్రాంతమంతా పచ్చదనం తో కాలుష్య రహితంగా మంచి వాతావరణంలో ఉండాలంటే మొక్కలు నాటాలి. మనం పిల్లలని పెంచుకునే విధంగా మొక్కలను పెంచుకోవాలి. బర్త్ డే లకు, పెళ్లి రోజులకు, ప్రత్యేక రోజులకు మొక్కలు నాటాలి. ఒక మొక్కను నాటి దానిని పెంచడం ఒక బాధ్యత గా పిల్లలని పెంచినట్టు పెంచాలి. దేశ రాజధాని ఢిల్లీలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంతో అక్కడ ఉండే పరిస్థితి లేదని అన్నారు. తెలంగాణ లో కాలుష్య రహితంగా ఉండాలని ప్రభుత్వాలు అనేక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. మొక్కలు నాటడానికి వన మహోత్సవం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో వార్డు లో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలి. మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాలి జిల్లాలో ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలి అందరూ సామాజిక బాధ్యతగా తీసుకొని అందరూ పాల్గొనాలి. రాజకీయ నాయకులు, అధికారులు, మహిళా సంఘాలు మొక్కలు నాటాలి. మొక్కలు నాటేల అధికారులు విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించాని అన్నారు.

## ములుగులో టెన్షన్

**వరంగల్ :** ములుగు జిల్లాలో టెన్షన్ టెన్షన్.. నెలకొంది. కాంగ్రెస్ లబ ఃఖీా వార్‌గా మారింది రమేష్ అనే యువకుడి ఆత్మహత్య. పోటాపోటికి నిరసనలకు పిలుపునిచ్చాయి ఇరుపార్టీలు. దీంతో స్థానికంగా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇందిరమ్మ ఇంటి కోసం రమేష్ అనే వ్యక్తి సూసైడ్ చేసుకోవడం రాజకీయ దుమారం రేపుతున్నది. నేడు బీఆర్ఎస్ నిరసనలకు పిలుపునిచ్చింది. ఃఖీాను అడ్డుకునేందుకు చలోములుగుకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. నేడు మంత్రుల పర్యటనతో స్థానికంగా టెన్షన్ వాతావరణం నెలకింది. దీంతో పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ములుగు జిల్లా వ్యాప్తంగా సిటీ పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు పోలీసులు. ఈ నెల 31వ తేదీ వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ాఖ శబరీష్ తెలిపారు. నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, ధర్నాల పై నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ములుగుకు వచ్చే అన్ని దారులలో ప్రత్యేక పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. కాగా, ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్కా రమేశ్ (29) హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ఆయన, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో తనపేరు లేకపోవడంపై మనస్థాపం చెందాడు. అధికారులను, స్థానిక నాయకులను సంప్రదించినా చుక్కెదురైంది. దీంతో ఎవరెవరికి ఇళ్లు వచ్చాయనే అంశంపై 'చల్వాయి సమాచారం' అనే

## ఘనంగా మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు..




**ఆలేరు, జూలై 07( ప్రభాత సూర్య):** ఎమ్మార్పీఎస్ 31వ, ఆవిర్భావ వేడుకలను సోమవారం. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం కేంద్రం లో ఎమ్మార్పియస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడులకను, ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ జన్మదినాన్ని కేకు కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది. మిఠాయిలు పంపిణీ చేయడం. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జులై 07, 1994న ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఏర్పడి దేశ వ్యాప్తంగా విస్తరించి 31 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. అంతే కాకుండ, ఒక్కప్పుడు కులం పేరు చెప్పుకోవడానికి సిగ్గు పడే దళిత, గిరిజన, బహుజన జాతులు తమ తమ కులాన్ని పేరు చివరన పెట్టుకొని ఆత్మగౌరవంగా చెప్పుకొనే స్థాయికి తీసుకువచ్చిన ఘనత మందకృష్ణ మాదిగ దే అని అన్నారు.... ఎమ్మార్పీఎస్ ఒక్క కుల సంఘమై ఏర్పడి ఎన్నో రాజీలేని పోరాటాలు చేసి ఏ రాష్ట్రంలో లేని పథకాలను సాధించి పెట్టింది. ఆరోగ్యశ్రీ పథకం, వికలాంగుల పెన్షన్లు, వృద్ధులు, వితంతుల పెన్షన్లు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించడం ఎస్సీ ఎస్టీ ల ఉద్యోగ రంగాలలో ప్రమోషన్ ఇవన్నీ ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటం వల్లనే అమలవుతున్నయని అన్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఏప్రిల్ 14, 2025న రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం వల్లనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పియస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ, కో ఇంచార్జ్ దుప్పల్లి అనిల్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ జాతీయ నాయకులు కందుల శంకర్ మాదిగ, మాజీ ఎంపిపి గంధమల్ల అశోక్ మాదిగ, సీనియర్ నాయకులు మోత్కూరి ఐలయ్య మాదిగ, మార్కెట్ డైరెక్టర్ చిలుకు కిష్టయ్య మాదిగ, ఎం ఈ ఎఫ్ నాయకులు చిలుకు స్వామి మాదిగ, మండల కన్వీనర్ తుడుం గణేష్ మాదిగ,సీనియర్ నాయకులు తిప్పారపు మల్లేష్ మాదిగ,కందుల స్వామి మాదిగ, పర్రె రమేష్ మాదిగ, కోనాపురం నాగరాజు మాదిగ,భువనగిరి లక్ష్మణ్ మాదిగ, కంతి మహేందర్ మాదిగ, పుట్టల కిష్టయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# దీర్ఘాయుష్మాన్ భవ.. రిలీజ్ డేట్ ఫిక్స్

కార్తీక్‌రాజు, నోయల్ ,మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం “దీర్ఘాయుష్మాన్ భవ”. ఈ సినిమాకు ఎం.పూర్ణానంద్ దర్శకత్వం వహించారు. త్రిపుర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత వంకాయలపాటి మురళీకృష్ణ నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా విడుదలకు సిద్దమైంది. ఈ చిత్రం ట్రైలర్, పాటలను హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమంలో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ..’కొత్త నిర్మాతలకు చిత్ర పరిశ్రమ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటుంది. అయితే కొత్త నిర్మాతలు చిత్ర పరిశ్రమ మీద కనీసం ఒక ఏడాది పాటు అవగాహన పెంచుకుని వస్తే బాగుంటుంది. దీనికి సంబంధించి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ఛాంబర్ తరపున మేము ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తూనే ఉన్నాం. పెద్ద, చిన్న సినిమాల సమస్యలు, సాధ్యాసాధ్యాల గురించి ఛాంబర్‌లో చర్చించబోతున్నాం. ఇక ఈ సినిమా విషయానికి వస్తే, మంచి అభిరుచితో, మంచి కాంబినేషన్ ఆర్టిస్టులతో ఈ సినిమా తీసినట్లు అనిపిస్తోంది. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని ఆశిస్తున్నా” అని అన్నారు. నిర్మాత నట్టి కుమార్ మాట్లాడుతూ.. “చిన్న సినిమాల సమస్యలను తీర్చేందుకు ఇటు పరిశ్రమ, అటు రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలి. మల్టీ ప్లెక్స్‌ల్లో పేదవాడు సినిమా చూసే విధంగా ఆక్యుపెన్సీలో 20 శాతం టిక్కెట్ రేట్లను 75 రూపాయలుగా నిర్ణయించాలి. ఫామిలీ అంతా కూర్చుని హాయిగా చూసుకునేలా ఈ చిత్రం ఉంటుంది” అని అన్నారు. చిత్ర దర్శకుడు ఎం.పూర్ణానంద్ మాట్లాడుతూ.. “ఫ్యామిలీ ప్యాక్ చిత్రమిది. అందరినీ ఆహ్లాదపరిచే కామెడీ, ఉంది. సోసియో ఫాంటసీగా దీనిని మలిచాం” అని తెలిపారు. ఈ చిత్రంలో ఆమని, కాశీ విశ్వనాథ్, పృథ్వీరాజ్, సత్యం రాజేష్, గెటప్ శ్రీను , తాగుబోతు రమేష్, జె మిని సురేష్, నోయల్, గుండు సుదర్శన్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వినోద్ సంగీతమందించారు. ఈ చిత్రం ఈనెల 11న థియేటర్లలో విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు.

# ‘కుబేర’... ఇదే టాప్



ఈ రోజుల్లో కొత్త సినిమాల జోరంతా వీకెండ్ వరకే. పాజిటివ్ టాక్ తెచ్చుకున్న సినిమాలు కూడా వారాంతం తర్వాత డల్ అయిపోతుంటాయి. ఇంకో వీకెండ్ వచ్చేసరికి మళ్లీ కొత్త సినిమాలు వస్తాయి. అవి లీడ్ తీసుకుంటాయి. ముందు వారం వచ్చిన సినిమా చల్లబడిపోతుంటుంది. ఐతే ఈ వీకెండ్లో మాత్రం భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. కొత్త సినిమాకు ఆక్యుపెన్సీలు అంతంతమాత్రంగా ఉన్నాయి. గత వారం వచ్చిన సినిమాకు కూడా స్పందన గొప్పగా లేదు. కానీ రెండు వారాల ముందు రిలీజైన సినిమానే లీడ్ తీసుకుంటుండడం విశేషం. ఆ చిత్రమే.. కుబేర. ఈ సినిమా రిలీజై రెండు వారాలు దాటినా.. బాక్సాఫీస్ దగ్గర ఇంకా స్ట్రాంగ్‌గా సాగుతోంది. వీక్ డేస్‌లో ఆక్యుపెన్సీలు పెద్దగా లేవు కానీ.. వీకెండ్ వచ్చేసరికి ధనుష్-నాగ్‌ల సినిమా ,రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేజర్ సిటీస్‌లో మంచి ఆక్యుపెన్సీలతో నడుస్తోంది. ముఖ్యంగా మల్టీప్లెక్సుల్లో ఈ సినిమాకు స్పందన బాగుంది. ఈ వీకెండ్లో రిలీజైన ‘తమ్ముడు’ సినిమాకు పూర్తిగా నెగెటివ్ టాక్ తెచ్చుకోవడంతో తొలి రోజు నుంచే డల్లుగా నడుస్తోంది. శని, ఆదివారాల్లో వసూళ్లు ఆశాజనకంగా లేవు. సినిమా రిజల్ట్ ఏంటో అర్థమైపోయాక నిర్మాత దిల్ రాజు దీన్ని పుష్ చేయడానికి ప్రయత్నించట్లేదు. ఇక గత వారం రిలీజైన ‘కన్నప్ప’ తొలి వీకెండ్ తర్వాత బాగా డౌన్ అయిపోయింది. మళ్లీ ఆ సినిమా పుంజుకోలేదు. వీకెండ్ వచ్చాక కూడా ‘కన్నప్ప’ ఆక్యుపెన్సీల్లో పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ రెండు చిత్రాలనూ వెనక్కి నెట్టి పాత చిత్రమైన ‘కుబేర’ లీడ్ తీసుకోవడం విశేషమే. ఐతే తమిళంలో మాత్రం ‘కుబేర’ తొలి వీకెండ్ తర్వాత వాషౌట్ అయిపోయింది. అక్కడ డిజాస్టర్ అయిన సినిమా.. తెలుగులో మాత్రం సూపర్ హిట్ రేంజిని అందుకుంది.



## రామాయణ’ కోసం వారిద్దరికి భారీ రెమ్యునరేషన్

బాలీవుడ్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం ‘రామాయణ’ దంగల్ మూవీ దర్శకుడు నితీశ్ తివారీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో రాముడిగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తుండగా.. సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు. అయితే, వారిద్దరి రెమ్యునరేషన్ గురించి పలు వార్తలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రం.. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగం విడుదల కానున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. రామాయణ చిత్రం రెండు భాగాలు కలిపి సుమారు రూ. 1600 కోట్లకు పైగా బడ్జెట్‌తో రకెక్కనుందని సమాచారం. విజువల్ వండర్‌గా రానున్న ఈ మూవీని రాకింగ్ స్టార్ యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, అలాగే నమిత్ మల్హోత్రా నిర్మాణ సంస్థ ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా కలిసి ఈ మూవీని నిర్మిస్తు న్నాయి. దేశంలోనే అత్యంత ఖరీదైన సినిమాగా ‘రామాయణ’ చరిత్ర సృష్టించింది. అయితే, ఈ సినిమాలో రాముడిగా నటిస్తున్న రణ్‌బీర్ కపూర్ రూ. 150 కోట్లు రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు సమాచారం. రెండు భాగాలకు కలిపి ఈ మెత్తం తీసుకుంటున్నారని టాక్. సీతగా నటిస్తున్న సాయి పల్లవి రూ. 15 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీలో ఒక వార్త వైరల్ అవుతుంది. రామాయణ సినిమా లో లంకాధిపతి రావణుడి పాత్రలో ‘కేజీఎఫ్’ ఫేమ్ యశ్ కనిపించనున్నారు. రవి దూబే (లక్ష్మణుడు), సన్నీ డియోల్ (ఆంజనేయుడు)గా కనిపించను న్నారు. వీరితో పాటు వివేక్ ఒబెరాయ్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా, కాజల్ అగర్వాల్, అరుణ్ గోవిల్, షీబా చద్దా వంటి సూపర్‌స్టార్స్ ఈ మూవీ కోసం పనిచేస్తున్నారు. ఓ



## ఈ వారంలో చిన్న చిత్రాలదే హవా..

### ఓటీటీ, థియేటర్‌లో సందడి చేయనున్న సినిమాలేంటి?

జులై రెండో వారంలో పెద్ద సినిమాలేవి విడుదల కాకపోతుండడంతో చిన్న సినిమాలు క్యూట్ కట్టాయి. ముందుగా ఈ వారం అందరి దృష్టిని ఆకర్షించిన చిత్రం ఆర్కే నాయుడు ది 100. ‘మొగలిరేకులు’ ఫేం సాగర్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రం జులై 11న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఇక ఈ సినిమాకి పోటీగా యంగ్ హీరో సుహాస్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ డ్రామా ఓ భామ అయ్యో రామా చిత్రం కూడా జులై 11న థియేటర్స్‌లో సందడి చేయనుంది. ఇక గీతానంద్, మిత్రా శర్మ జంటగా నటించిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ వర్జిన్ బాయ్స్ కూడా ఈ నెల 11న సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఇష్టపడే ‘సూపర్ మ్యాన్’ మూవీ ఈ నెల 11న ఇంగ్లీష్‌తో పాటు భారతీయ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలానే పుల్కిత్ దర్శకత్వంలో రాజ్ కుమార్ రావ్ ప్రధాన పాత్రలో నటించిన గ్యాంగ్ స్టర్ డ్రామా మాలిక్ చిత్రం కూడా ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఓటీటీల్లోకి వచ్చే మూవీస్/వెబ్ సిరీస్‌లు విషయానికి వస్తే.. జులై 8 – మూన్ వాక్ (మలయాళం మూవీ – జియో హాట్ స్టార్), కరాటే కిడ్ (అమెజాన్ ప్రైమ్ వీడియో), ది పొనీషియన్ స్కీమ్ (ప్రైమ్ వీడియో), ది అన్ హొలీ ట్రినిటీ (అమెజాన్ ప్రైమ్ వీడియో), వాచ్ ది స్కైస్ (అమెజాన్ ప్రైమ్ వీడియో), భైరవం ( జీ5 తెలుగు), జులై 9 –బల్లార్డ్ (ఇంగ్లీష్ సిరీస్ – ప్రైమ్ వీడియో), రిఫార్మ్‌డ్ (జియో హాట్ స్టార్), అండర్ ఏ డార్క్ సన్ (వెబ్ సిరీస్ – నెట్ ఫ్లిక్స్), జియామ్ (నెట్ ఫ్లిక్స్) లో స్ట్రీమ్ కానున్నాయి. జులై 10 – 7 బియర్స్ (యానిమేటెడ్ సిరీస్ – నెట్ ఫ్లిక్స్), బ్రిక్ (నెట్ ఫ్లిక్స్), ఏ బ్రదర్ అండ్ సెవెన్ సిబ్లింగ్స్ (నెట్ ఫ్లిక్స్), జులై 11 – నరివెట్ట (సోనీ లివ్), ఆప్ జైసా కోయి (నెట్ ఫ్లిక్స్), కలియుగం (సన్ నెక్ట్స్), మిస్టర్ అండ్ మిస్ బ్యాచిలర్ (మనోరమ మ్యాక్స్), కర్కి (సన్ నెక్ట్స్), మిస్టర్ రాణి (లయన్స్ గేట్ ప్లే), స్పెషల్ ఓపీఎస్ (జియో హాట్ స్టార్), ఏ మోస్ట్ కాప్స్ (నెట్ ఫ్లిక్స్), ఫోర్ ఇయర్స్ లేటర్ (లయన్స్ గేట్ ప్లే), మేడ్ యాజ్ డెస్టినేషన్ వెడ్డింగ్ (నెట్ ఫ్లిక్స్), ది రియల్ హౌస్ వైవ్స్ ఆఫ్ ఆరెంజ్ కంట్రీ సీజన్ 9 (జియో హాట్ స్టార్), డ్రాప్ (ప్రైమ్ వీడియో), నోబు (ప్రైమ్ వీడియో), పేవ్‌మెంట్స్ , సావరిన్ (ప్రైమ్ వీడియో), జులై 13 – బ్యూరీడ్ ఇన్ ద బ్యాక్ యార్డ్ సీజన్ 6 (జియో హాట్ స్టార్) చిత్రాలు స్ట్రీమ్ కానున్నాయి.

## ఆ క్రికెటర్‌తో అనవసరంగా డేటింగ్ చేసా..

టాలీవుడ్ లో ఈ అమ్మడు ఓ హాట్ బ్యూటీ. తన అందంతో ఎంతో మంది కుర్రాళ్ళ గుండెల్లో బాణాలు గుచ్చింది. హీరోయిన్ గా రాణిస్తూనే స్పెషల్ సాంగ్స్ తో అదరగొట్టింది. నిజానికి హీరోయిన్ గా కంటే స్పెషల్ సాంగ్స్ తోనే ఎక్కువ పాపులర్ అయ్యింది ఈ వయ్యారి భామ. కెరీర్ బిగినింగ్ లో ఈ చిన్నది పలు యాడ్స్ చేసి ప్రేక్షకులను మెప్పించింది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఈ బ్యూటీ ఇప్పుడు గ్లామర్ పాత్రలకే పరిమితం అయ్యింది ఈ చిన్నది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? స్టార్ హీరోలతో స్టెప్పులేసింది.. అలాగే స్టార్ క్రికెటర్స్ తో ఎఫైర్స్ పెట్టుకుంది ఈ భామ. తాజాగా ఆమె స్టార్ క్రికెటర్ గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంతకూ ఆ భామ ఎవరంటే.. రాయ్ లక్ష్మి 2005లో తమిళ చిత్రం “కర్క కసదర”తో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. అదే ఏడాది కన్నడ చిత్రం “వాల్మీకి” లో శివ రాజ్‌కుమార్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో “కంచనమాల కేబుల్ టీవీ” (2005), “నీలి మేఘం” (2012), “బలుపు” (2013) వంటి చిత్రాలలో నటించింది. అలాగే స్పెషల్ సాంగ్స్ లోనూ అదరగొట్టింది. పవన్ కళ్యాణ్, చిరంజీవి, బాలకృష్ణలాంటి స్టార్ హీరోలతో స్టెప్పులేసింది. ప్రస్తుతం ఈ బ్యూటీ సినిమాల స్పీడ్ తగ్గించింది. నటి రాయ్ లక్ష్మీ మహేంద్ర సింగ్ ధోనితో తనకు గతంలో ఉన్న రిలేషన్‌షిప్ గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రాయ్ లక్ష్మీ ధోనితో తన సంబంధాన్ని “ఒక మచ్చ” గా అభివర్ణించింది. భవిష్యత్తులో తన పిల్లలు ఈ విషయం గురించి ప్రశ్నిస్తే తాను ఎలా సమాధానం చెప్పాలోనని ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే గతంలో ధోనితో తనకు సంబంధం ఉందని వచ్చిన వార్తలను తాజాగా తవ్వి తీస్తున్నారని, ఇంటర్నెట్‌లో ఈ విషయాలు ఇప్పటికీ వైరల్ అవుతున్నాయని రాయ్ లక్ష్మీ అసహనం వ్యక్తం చేసింది. ఈ పిచ్చి ప్రచారాన్ని దూరం పెట్టాలని కోరింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.